

# సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతి

● సోదరుని మృతితో కార్యక్రమాలు రద్దు చేసుకుని హైదరాబాద్ చేరిన సీఎం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు నేడు కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా . అనారోగ్యంతో బాధపడుతున్నారు.. దీంతో హైదరాబాద్ లోని ఏఐజీ ఆసుపత్రిలో గత వారం రోజుల నుంచి చికిత్స పొందుతున్నారు. ఈరోజు ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. దీంతో కొద్దిసేపటి క్రితం ఆయన మరణించారు. నారా రామ్మూర్తినాయుడు 1952లో నారా కర్జూరనాయుడు, అమ్మణమ్మ దంపతుల రెండో సంతానంగా జన్మించారు. రామ్మూర్తి నాయుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిలో ఒకరు హీరో రోహిత్ కాగా.. మరొకరు నారా గిరీష్. రామ్మూర్తి నాయుడు 1994లో చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత అనారోగ్య కారణాల దృష్ట్యా రాజకీయాలకు దూరమై ఇంటికే పరిమితమయ్యారు రామ్మూర్తి నాయుడు. నేటి ఉదయమే తన చిన్నాన్న ఆరోగ్య పరిస్థితి విషమించిందన్న సమాచారంతో ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్ని అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని ఏపీ అసెంబ్లీ నుంచి హుటాహుటిన హైదరాబాద్ కు బయలుదేరారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఆయన విమానంలో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు.. అనంతరం అయన అక్కడ నుంచే నేరుగా ఏఐజీ హాస్పటల్ కు వెళ్లారు. ప్రస్తుతం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో ఉన్నారు.

# సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననం

● తల్లి, చెల్లిపై అసభ్య పోస్టులు పెట్టినా వదిలేస్తారా?
● చేయని తప్పుకు 53 రోజులు జైలు జీవితం అనుభవించాను
● సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయాల్సిందే
● అన్ని రంగాల్లో ఏపీ అగ్రభాగాన నంబర్ వన్‌గా ఉండాలనేది లక్ష్యం ● ఆదిశగానే కూటమి ప్రభుత్వం అడుగులు
● హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో సిఎం చంద్రబాబు




డిల్లీ: సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణమని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీ ధిఅధ్యక్షుడి తల్లి, చెల్లిపైన వారి పార్టీ నాయకులే అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్నారు. డిల్లీలో పర్యటించిన చంద్రబాబు.. హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. ప్రజల కోసం పనిచేసి అక్రమ కేసులకు గురికావడం తనను బాధించిందన్నారు. అక్రమ కేసులు పెట్టి 53 రోజులు వేధించారు.. చేయని తప్పునకు శిక్ష అనుభవించానని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఎక్కడా నిరాశకు గురికాలేదు, ధైర్యం కోల్పోలేదన్నారు. 53 రోజుల జైలు జీవితం.. మరింత పట్టుదల పెరిగేలా చేసిందని, ఆ పట్టుదలను ప్రజలకు సేవ చేయటానికి ఉపయోగిస్తున్నానని చంద్రబాబు చెప్పారు.

**సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయాలి...**

"సోషల్ మీడియాలో విపరీత ధోరణులు కనిపిస్తున్నాయి. వ్యక్తిత్వ హననం జరుగుతోంది. మహిళలను కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్నారు. మమ్మల్ని మాత్రమే కాదు.. సొంత తల్లి, చెల్లిని కూడా బూతులు తిట్టిస్తున్న వాళ్లని ఏం చేయాలి? ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకూడదు అంటే ఎలా? సోషల్ మీడియాలో మహిళల్ని వేధించే వారిని ఎలా నియంత్రించాలనే అంశంపై తీవ్ర స్థాయిలో చర్చ జరగాలి. సామాజిక మాధ్యమాల్లో వేధించే సైకోలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అగ్రభాగాన నంబర్ వన్‌గా ఉండాలనేది లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. టెలికాం రంగంలో డీరెగ్యులేషన్ వల్ల పురోగతి ఉంటుందని రిపోర్టు ఇచ్చాను. దాన్ని అమలు చేయడం వల్ల టెలికాం రంగం వృద్ధి చెందింది. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని తీసుకొస్తున్నాం. దీని ద్వారా ప్రజలకు చేరువగా, సులువుగా మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. తద్వారా ప్రజా సేవలను చివరి వ్యక్తి వరకు అందించాలన్నది మా లక్ష్యం. ఈ యుగంలో సమాచారమే ఓ పెద్ద నిధి. ఏఐ, డీప్ టెక్నాలజీలను ఉపయోగించి అన్ని రంగాల్లో పరిష్కారాలు సాధించవచ్చు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచంలో ఏ మూల ఉన్నా మన పనులు చేసుకుంటూ పోవచ్చు.

**కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే ఎన్నికల్లో పోటీకి అర్హత...**

ఇప్పుడు చైనా, జపాన్ సహా అనేక ప్రపంచ దేశాల్లో వయోధికులు ఎక్కువైపోయారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సమస్య ప్రారంభమైంది. ఫెర్టిలిటీ రేటు ఇక్కడ తగ్గిపోతోంది. సాధారణంగా ఇది 2.1 కంటే ఎక్కువగా ఉంటే సమస్య ఉండదు. ప్రస్తుతం బోర్డర్ లైన్‌లో జననాల రేటు ఉంది. ఇది కాస్త తగ్గితే జపాన్, చైనా మాదిరి సమస్య మన దేశంలో కూడా మొదలవుతుంది. భారతదేశంలో 145 కోట్ల జనాభా ఉంది. పాపులేషన్ మేనేజ్‌మెంట్ చేస్తే ప్రపంచంలో మనల్ని కొట్టేవారే ఉండరు. మనం ఒక ప్రణాళికాబద్ధంగా అమల్లోకి తీసుకువస్తే.. 30-40 కోట్ల మంది భారతీయులు ప్రపంచంలో అన్ని మూలలకు వెళ్లి పని చేసి దేశానికి ఆదాయం తీసుకొస్తారు. బ్రిటీష్ వాళ్లు భారత్‌కి వచ్చి పరిపాలించిన తరహాలో మనం కూడా ప్రపంచదేశాలకు వెళ్లి ఆ దేశాలను ఏలుతాం. ఒకప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా నిబంధనలు పెట్టాను. ఇప్పుడు ఆ నిబంధన తొలగించి... కనీసం ఇద్దరు పిల్లలు ఉంటే తప్ప పోటీకి అర్హత లేదని పెట్టాలని చెబుతున్నా. మానవ వనరులు, నైపుణ్యాల అభివృద్ధి జరగాలి.. దానికి అనుగుణంగా పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ కల్పన జరగాలి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఒకటో తరగతి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

**వాజ్‌పేయీ పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు...**

తెలుగుదేశం పార్టీ తొలి నుంచీ దేశ రాజీయాల్లో కీలక పాత్ర పోషించింది. దేశాభివృద్ధి కోసం తెలుగుదేశం ఎప్పుడూ ముందుంటుంది. భాజపాకి వాజ్‌పేయీ పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు. మోదీ నేతృత్వంలో దేశం ఆర్థికంగా బలంగా తయారవుతోంది. రానున్న రోజుల్లో ప్రపంచంలో భారతదేశం రెండు, మూడు స్థానాల్లో ఉంటుంది. నరేంద్రమోదీ మా నాయకుడు. ఆయన నేతృత్వంలోనే ముందుకు వెళ్తాం. హరియాణా సీఎం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ప్రధాని ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి సీఎంల సమావేశం జరిగింది. నాలుగు గంటల పాటు జరిగిన సమావేశంలో 2029 ఎన్నికలకు ఏ విధంగా సమాయత్తం అవ్వాలనే విషయంపై మోదీ అందరి అభిప్రాయాలు తీసుకున్నారు.

**మా కూటమి దీర్ఘకాలం కొనసాగుతుంది..**

ఏపీలో కూడా 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం అవుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తితో పాటు.. ఎన్డీఏ కూటమిపై జనానికి భరోసా కలిగింది. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా వస్తాయని మేం ముందుగానే ఊహించాం. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 57 శాతం ఓట్లు.. 93 శాతం సీట్లు కూటమికి ప్రజలు ఇచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా పవన్ కల్యాణ్ మూడు పార్టీలను కలిపారు. దాని ఫలితం ఇప్పుడు చూశాం. జాతీయ స్థాయిలో కూడా భాజపాకి పూర్తి మెజారిటీ వస్తుందని అనుకున్నాం. కూటమిలో ఎటువంటి సమస్యలు లేవు, అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాం. మా కూటమి దీర్ఘకాలం కొనసాగుతుంది" అని చంద్రబాబు అన్నారు.

## మరాఠా గడ్డ నుంచి
# పవన్ మాస్ వార్నింగ్

● సనాతన హిందూ ధర్మం కోసం పోరాటం
● ఠాక్రే కల అయోధ్య రామాలయం సాకారం చేసిన ప్రధాని మోడీ
● మహారాష్ట్రలోని డేగ్లూర్ బహిరంగ సభలో పవన్ ప్రసంగం
● హిందీ, మరాఠీ భాషల్లో ప్రసంగానికి మంచి స్పందన



డేగ్లూర్ : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మహాయుతి కూటమి అభ్యర్దును గెలిపించాలని పిలుపునిచ్చారు. బాలాసాహెబ్ ఠాక్రే.. దేశాన్ని రక్షించేందుకు ప్రతీ క్షణం తపించారని చెప్పుకొచ్చారు. శివసేన - జనసేన సనాతన హిందూ ధర్మం కోసం పోరాటం చేస్తున్నాయని వివరించారు. హైదరాబాద్ నుంచి ఇక్కడకు వచ్చి హెచ్చరికలు చేస్తున్నారని..వారికి భయపడేది లేదని పరోక్షంగా పవన్ ఓవైసీని హెచ్చరించారు. బీజేపీ కూటమిని గెలిపించండి జనసేనాని పవన్ కల్యాణ్ మహారాష్ట్రలోని డేగ్లూర్ బహిరంగ సభలో ప్రసంగించారు. మహాయుతి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మహారాష్ట్ర సంస్కృతి, మరాఠి భాషను రక్షించుకోవాలంటే మహాయుతి కూటమి గెలపు అవసరమని చెప్పుకొచ్చారు. బాలా సాహెబ్ ఠాక్రే అయోధ్యలో రామాలయం గురించి పోరాటం చేసారని.. ప్రధాని మోదీ అయోధ్యలో రామాలయం సాకారం చేసారని గుర్తు చేసారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తరువాత జమ్ము కాశ్మీర్ లో శాంతి కనిపిస్తుందన్నారు. బీజేపీ హయాంలోనే మహారాష్ట్రకు భవిష్యత్ ఉందని చెప్పారు. సనాతన ధర్మం కోసం పవన్ తన ప్రచారంలో హిందీ, మరాఠీ భాషల్లో ప్రసంగించారు. మహాయుతి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. శివసేన - జనసేన అన్యాయం పై పోరాటం చేస్తాయన్నారు. ధర్మం కోసం రెండు పార్టీల సనాతన ధర్మాన్ని రక్షించటానికే ఉన్నాయన్నారు. అన్యాయం పై ఈ రెండు పార్టీలు పోరాటానికి ఎప్పుడూ సిద్దంగా ఉంటాయన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కారణంగానే ఇక్కడి దేవాలయాలు భద్రంగా ఉన్నాయని చెప్పారు. మనమంతా విడిపోయి బలహీనులుగా ఉందామా.. కలిసి అభివృద్ధి వైపు అడుగులు వేద్దామా అని ప్రశ్నించారు. ఇక్కడ ఏ ప్రాంతాల వారున్నా.. వారందరిలో సనాతన ధర్మమే నినాదంగా కనిపిస్తోందని పవన్ చెప్పుకొచ్చారు. సహనం పరీక్షించవద్దు మమాయుతికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని పవన్ కోరారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం, మరాఠి సంస్కృతి కోసం, మరాఠి భాష కోసం ప్రజలంతా మహాయుతి కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ మధ్య కాలంలో ఓవైసీ మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కౌంటర్ ఇచ్చారు. మహారాష్ట్ర ఛత్రపతి శివాజీ నేల అని.. అలాంటి బెదిరింపులకు ఎవరూ భయపడరంటూ హెచ్చరించారు. సాధ్యమైనంత శాంతంగా ఉంటాం, బరిస్తాం, కానీ.. హద్దులు దాటితే మంచిది కాదని పవన్ స్పష్టం చేసారు.

# మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం పవన్

● మరాఠ భాషలో ప్రసంగం ● ఓట్లు అడగడానికి రాలేదంటూనే ప్రచారం ● మహనీయులు జన్మించిన ప్రాంతంలో పర్యటించే అవకాశం కలిగిందని ప్రకటన ● స్వరాజ్యం అనే పదానికి అర్థం తెలిపిన నేలపై గౌరవం తెలపడానికి వచ్చానన్నారు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా జన సేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ప్రచార కార్యక్రమాలు శనివారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజున దేగ్లూరులో జరిగిన సభలో ప్రసంగించారు. మరాఠ బాషలోనే ఆయన ప్రసంగించడంతో ప్రజల నుంచి అనూహ్యంగా స్పందన లభించింది. నేను ఇక్కడికి కేవలం ఓట్లు అడగడానికి రాలేదు. ఎందరో మహనీయులు పుట్టిన నేల, ఎందరో సాధువులు నడిచిన నేల, మహానుభావులు ఉన్న నేల మీద గౌరవం తెలపడానికి వచ్చానన్నారు. చత్రపతి శివాజీ పుట్టిన నేల.. మన హక్కుల మీద పోరాటం నేర్పిన నేల మీద గౌరవం తెలపడానికి వచ్చానని, స్వరాజ్యం అనే పదానికి అర్థం తెలిపిన నేలపై నాకున్న గౌరవం తెలపడానికి వచ్చానని చెప్పారు. బాబా సాహెబ్ అంబేద్కర్ కర్మ భూమిగా నిలచిన గొప్ప భూమిపై గౌరవం తెలపడానికి వచ్చాను. రాజ మాత జీజీయా భాయ్ నేర్పిన విలువలతో ఈ నేలకు మనస్ఫూర్తిగా నమస్కరించడానికి వచ్చానని చెప్పారు. మరాఠాలో మాట్లాడేందుకు ప్రయత్నిస్తాను. మాట్లాడేప్పుడు తప్పులు ఉంటే క్షమించండన్నారు. బాలా సాహెబ్ ఠాక్రేను జీవించి ఉండగా కలిసే అవకాశం రాలేదు. అన్యాయాలు, అక్రమాలు ఎదిరించడంలో ఆయన నాకు బలమైన స్ఫూర్తి. సనాతన ధర్మాన్ని ఏ మాత్రం భయపడకుండా పరిరక్షించడంలో ఆయన నాకు స్ఫూర్తి. జనసేన ఏడు సిద్దాంతాల్లో ఒకటైన ప్రాంతీయతను విస్మరించని జాతీయ వాదం అనే సిద్ధాంతానికి బాలాసాహెబ్ స్ఫూర్తి. ఏ విషయాన్ని అయినా ధైర్యంగా చెప్పడం.. నిర్మోహమాటంగా నిక్కచ్చిగా ఉండడం. అధికారంతో సంబంధం లేకుండా మన సిద్దాంతాలకు బలంగా కట్టుబడి ఉండడం బాలా సాహెబ్ ఠాక్రే నుంచి నేర్చుకున్నానని చెప్పారు. గడచిన పదేళ్లుగా దేశంలో ఎన్డీఏ పాలనను గమనిస్తే ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ కనబడుతుంది. దివ్య రామ మందిరంతో అలంకరించిన అయోధ్య కనబడుతుంది. ప్రపంచ పటంపై.. తిరంగా రెపరెపలాడుతూ కనబడుతోంది. ఎన్డీఏ పాలనలో దేశ నలూములలను కలిపే రహదారులు కనిపిస్తున్నాయి. పల్లెపల్లెకు విస్తరించిన రోడ్లు కనబడుతోంది. గడచిన పదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం 25 కోట్ల మంది భారతీయలను పేదరికం నుంచి విముక్తి చేసింది. 4 కోట్ల రైతులకు పంట బీమా అందించింది. పీఎం కిసాన్ ద్వారా 12 కోట్ల మందికి లబ్ది చేకూరింది.

ముద్ర యోజన ద్వారా 30 కోట్ల మంది ఆడబిడ్డలకు చేయూత ఇచ్చింది. గత పదేళ్లలో హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా శ్రీ నితిన్ గడ్కరీ గారు 11 వేల కిలోమీటర్ల రహదారులు నిర్మించారు. మహారాష్ట్రలోని నాగ్ పూర్ నుంచి థానే వరకు 701 కిలోమీటర్ల సమృద్ధి మహామార్గాన్ని నిర్మించారు. ఇది మహారాష్ట్ర నవనిర్మాణంలో కీలక ఘట్టం. 2028 లోపు మహారాష్ట్రను లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే క్రమంలో ఇలాంటి గొప్ప అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. భారత దేశాన్ని ఐదు లక్షల ట్రిలియన్ల జీడీపీతో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో మహారాష్ట్ర కీలకపాత్ర పోషించబోతోంది. ఇలాంటి తరుణంలో డేగ్లూర్ నియోజకర్గ అభివృద్ధి చాలా కీలకం. ఎన్డీఏ ప్రభుత్వం ఇక్కడ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ప్రభుత్వ విశ్రాంతి గృహం, డేగ్లూర్, బిలోమీ పోలీస్ స్టేషన్లు, కోర్టుల నిర్మాణం, హేమంత్ పంత్ ఆలయ నిర్మాణం, కుందల్ వాడీ బేవలీ రోడ్డు మార్గం నిర్మాణం పూర్తి చేసిందన్నారు. హర్ ఘర్ జల్ యోజన కింద 50 శాతం పనులు పూర్తయ్యాయి. డేగ్లూర్ నియోజకవర్గంతో ఇదే వేగంతో అభివృద్ధి కొనసాగాలంటే, మహారాష్ట్రను లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో ముందుకు వెళ్తున్న ఎన్డీఏ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలి. మీ కలలన్నీ సాకారం కావాలి అంటే ఎన్డీఏకు డేగ్లూర్ యువత, ఆడబిడ్డలు ప్రజల మద్దతు కావాలి. మహారాష్ట్ర చరిత్రను చూస్తే ఎంతో మంది సనాతన ధర్మాన్ని రక్షించేందుకు కృషి చేశారు. అలాంటి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో పాల్గర్ లో సాధువులు వేడుకున్నా వదలకుండా చంపేశారు. విశాల్ ఘడ్ చారిత్రక ఖిల్లాను ఆక్రమించారు. ఒక వర్గం ప్రజలను శాంతింపచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. మనకి కావాల్సింది ఇలాంటి ప్రభుత్వాలు కాదు. సాధువుల్ని, సంతవుల్ని, సనాతన ధర్మాన్ని కాపాడే ప్రభుత్వం మనకు కావాలి. మహారాష్ట్ర వ్యాప్తంగా చత్రపతి శివాజీ మహారాజ్ పోరాడిన దుర్గాలన్నీ దక్షిణ భారతాన్ని హిమాలయ పర్వతంలా కాపాడాయి. ఆక్రమణ దారుల్ని రానివ్వకుండా చేశాయి. దీంతో దక్షిణ దేశంలో దేవాలయాలు కూల్చలేకపోయారు. దానికి నేను మహారాష్ట్ర నేల, వీరులకి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. విశాల్ ఘడ్ ఖిల్లా అన్యాక్రాంతం అయిపోయింది. ఆక్రమణదారులు కైవసం చేసుకున్నారు.

చత్రపతి శివాజీ పోరాడింది వీరి మీదే. ఇప్పుడు మరోసారి పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దేశాన్ని చాలా కష్టపడి సాధించుకున్నాం. దేశాన్ని రక్షించుకోవాలంటే ఆ నిర్ణయం మీచేతుల్లో ఉంది. విడిపోయి బలహీనపడదామా? కలిసి బలంగా నిలబడదామా? విడిపోయి అస్థిత్వాన్ని ప్రమాదంలో నెట్టేద్దామా కలసి బంగారు భవిష్యత్తు నిర్మిద్దామా? విడిపోయి అరాచకతత్వానికి స్థానం కలిపిద్దామా? కలిసి అభివృద్ధి, సంక్షేమం వైపు పయనిద్దామా? ప్రాంతాలను దాటి సనాతన ధర్మం ఉండే నేల ఇది. ప్రజల హక్కుల గురించి, వాటి శక్తుల గురించి రామ్ ధారీ సింగ్ దినకర్ గారి మాటల్లో చెబుతాను. ప్రజలంతా కలిసి కట్టుగా ఒక్కసారి ఊపిరి తీస్తే దేన్నయినా ఎదుర్కొగలరు. బలంగా నీ శ్వాస వదిలితే తలలకు పెట్టుకున్న మహారాజుల కిరీటాలు కూడా ఎగిరిపోతాయి. అదే మహారాష్ట్ర నేల చెప్పిందన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేద్దామని హైదరాబాద్ నుంచి కొంత మంది వచ్చి మాకు 15 నిమిషాలు ఇవ్వండి అని కథలు చెప్పారు. పాత బస్తీలో కూర్చుని పోలీసులు 15 నిమిషాలు కళ్లు మూసుకుంటే హిందువులకు మేమేంటో చూపిస్తాం అంటారు. ఇది చత్రపతి శివాజీ పుట్టిన నేల, మా సహనం పరీక్షించకండి. సినిమాల్లో పోరాటం చేయడం గొడవపడడం తేలిక. నిజ జీవితంలో ధర్మం కోసం నిలబడడం, గొడవ పెట్టుకోవడం చాలా కష్టం. సనాతన ధర్మం చాలా బలమైన ధర్మం. సినిమాలు కేవలం ఆనందం మాత్రమే. సనాతన ధర్మ పరిరక్షణ కోసం మరాఠా భాష, సంస్కృతి కోసం మనమంతా కలసి పని చేయాలి. నేను మీ ముందుకు వచ్చి అడుగుతున్నాను. నాందేడ్ లోక్ సభ, డేగ్లూర్ అసెంబ్లీలకు పోటీ చేస్తున్న ఎన్డీఏ అభ్యర్దులకు అఖండ విజయం ఇవ్వండని కోరారు.

## జగన్‌కి ప్యాలెస్‌లు కావాలా?
# పేదలకు టిడ్కో ఇళ్లు అక్కర్లేదా?

**జివి ఆంజనేయులు ప్రశ్న**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ ప్రతి పేదవాడికి కూడు, గూడు, నీడ ఉండాలనే లక్ష్యంతో పనిచేసిందని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. టిడ్కో ఇళ్లపై అసెంబ్లీలో లఘు చర్చ జరిగింది. ఈ విషయంపై ఆంజనేయులు కీలక విషయాలు తెలిపారు. 7 లక్షల ఇళ్లను గతంలో ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. మొదటి దశలో 4 లక్షల 54 వేల ఇళ్లకు టెండర్‌లు పిలిచారని గుర్తుచేశారు. 2019కు ముందే 3 లక్షల 13వేల 832 ఇల్లు 90 శాతం పూర్తి అయ్యాయని వివరించారు. ఒక్క రూపాయికు ఇల్లు ఇస్తామని జగన్ మోసం చేశారని జీవీ ఆంజనేయులు విమర్శించారు. ఏడాదికి 5 లక్షలు ఇల్లు ఇస్తామని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోలేదని అన్నారు. ఐదేళ్లలో 25వేల ఇల్లు ఇస్తామని అన్నారని.. కానీ వైసీపీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డికు ప్యాలెస్‌లు కావాలి కానీ పేదలకు టిడ్కో ఇళ్లు వద్దా అని నిలదీశారు. బెంగళూరు, హైదరాబాద్, రుషికొండలో వాటిని కట్టారని చెప్పారు. రూ.430 కోట్లు ఖర్చు చేసి రుషికొండ ప్యాలెస్ కట్టారన్నారు. పేదవాడికి ఒక సెంట్ ఇల్లు అని, జగనన్న కాలనీ అన్నారని... అందులోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ వచ్చి ఉంటే ఈ లక్షలాది ఇల్లు పూర్తి అయ్యేవని అన్నారు. పేదలకు ఇల్లు రాకపోగా.. బ్యాంక్‌ల నుంచి వాయిదాలు, నోటీసులు వచ్చాయని అన్నారు. టిడ్కో ఇళ్ల కోసం రూ. 17 కోట్లు వడ్డీ చెల్లించారని... పేదవాడికి డిపాజిట్లు చెల్లించలేదని జీవీ ఆంజనేయులు అన్నారు. ఈ ఇళ్లను కూడా పేద వాళ్లకు కాకుండా వాళ్ల ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చారని చెప్పారు. 90 శాతం ఇల్లు పూర్తి అయినవి కూడా ఐదేళ్లలో పూర్తి చేయలేదని మండిపడ్డారు. వినుకొండలో 1200 ఇల్లు ప్రారంభిస్తే వాటిలో ఒకటి కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కోకొల్లలుగా ఉన్నాయన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ప్రజలకు చాలా నష్టం వాటిల్లిందని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు.


## గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్ విడుదల కాకముందే
# అభ్యర్థులకు న్యాయం చేయాలి

● 1:100 నిష్పత్తి ప్రకారం అవకాశం ఇవ్వాలి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిది: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థుల ఎంపికలో 1:100 విధానం అనుసరించాల్సిందే అంటూ ఏపీ సీఎం చంద్రబాబుని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి డిమాండ్ చేశారు. గ్రూప్ 2, డిప్యూటీ ఈవో పోస్టుల ఎంపికలో అనుసరించిన 1:100 విధానాన్నే గ్రూప్-1 విషయంలోనూ పాటించాలని షర్మిల కోరారు. ఇదే విషయమై కొన్ని రోజులుగా అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని ఆమె వెల్లడించారు. గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థుల ఎంపికపై షర్మిల మరోసారి సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. జీవో నంబర్ 5 ప్రకారం 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసే అధికారం ఏపీపీఎస్సీకి ఉందని వైఎస్ షర్మిల చెప్పారు. ఆ అధికారాన్ని ఉపయోగించి 1:100 రేషియో ప్రకారం అవకాశం ఇవ్వమని గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థులు అడగడంలో న్యాయం ఉందంటూ ఆమె చంద్రబాబుకు తెలిపారు. 89 పోస్టులకు మీరిచ్చిన 1:50 రేషియో ద్వారా 4,450 మంది మాత్రమే మెయిన్స్‌కి అర్హత పొందారని, 1:100 రేషియో లెక్కన పిలిస్తే మరో 4,450 మందికి అవకాశం దక్కుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అలా ఎంపిక చేయాలని అభ్యర్థులు ఆశ పడుతున్నారని ఆమె చెప్పుకొచ్చారు. గ్రూప్ 2, గ్రూప్ 1 పరీక్షల మధ్య సమయం తక్కువగా ఉండటం, సిలబస్ మధ్య వ్యత్యాసం, కొత్త సిలబస్ అని చెప్పి పాత సిలబస్‌లోనే పరీక్షలు నిర్వహించడం వంటి కారణాలతో చాలా మంది అభ్యర్థులు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని షర్మిల తెలిపారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న గ్రూప్ -1 ఉద్యోగాలు పోతే ఇప్పట్లో ఇక నోటిఫికేషన్ ఉండదని వారంతా ఆందోళనలో ఉన్నారని సీఎం చంద్రబాబు దృష్టికి షర్మిల తీసుకొచ్చారు. ఈ విషయంపై ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ని కలిసి విజ్ఞప్తి చేసినా ప్రభుత్వానికి పట్టింపు లేదంటూ ఆమె మండిపడ్డారు. గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్ విడుదల కాకముందే అభ్యర్థుల విజ్ఞప్తిని పరిశీలించి, న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు ఏపీసీసీ షర్మిల తెలిపారు.

# బోర్డు సభ్యులకు సేవా టికెట్ల కోటా పెంపు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: తిరుమలలో బోర్డు సభ్యులకు ప్రాధాన్యత పెరగనుంది. ఇప్పటి వరకు బోర్డు సభ్యులకు శ్రీవారి దర్శన.. సేవా టికెట్ల కోటాను పెంచాలని నిర్ణయించారు. అదే విధంగా ఎమ్మెల్యేలకు ఇచ్చే కోటాను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 18న జరిగే కొత్త పాలక మండలి తొలి సమావేశంలో టీటీడీలో చేపట్టే పలు సంస్కరణలతో పాటుగా బోర్డు సభ్యులు, ఎమ్మెల్యేల దర్శన ..సేవా కోటా టికెట్ల పెంపు పైన నిర్ణయానికి ఆమోద ముద్ర వేయనున్నారు. బోర్డు సభ్యుల కోటా టీటీడీ నూతన పాలక వర్గం కొలువు తీరింది. ఈ నెల 18న తొలి సమావేశం తిరుమలలో జరగనుంది. ఈ సమావేశంలో బోర్డు సభ్యులతో పాటుగా ఎమ్మెల్యేలకు ఇప్పటి వరకు ఉన్న శ్రీవారి దర్శన, సేవా టికెట్ల కోటా పెంపు పైన నిర్ణయం తీసుకోన్నారు. బోర్డు సభ్యులకు ఇక నుంచి సోమవారం నుంచి గురువారం వరకు ప్రతీ రోజు 20 బ్రేక్ దర్శన టికెట్లు, శని..ఆది వారాల్లో 12 చొప్పున జారీ చేయనున్నట్లు సమాచారం.

# ఈ భూమి మీద జగన్ ఉన్నంత కాలం సర్వనాశనమే

● జగన్ పెట్టిన బాధలకు నేను 10 సార్లు ఆత్మహత్య చేసుకోవాలి
● ప్రశ్నోత్తరాల సమయంలో విరుచుకుపడిన ఎమ్మెల్యే విష్ణుకుమార్



రాజు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఏపీ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 43 మంది జగన్ ప్రభుత్వంలో ఆత్మహత్యలు సుకున్నారన్నారు. పనులు చేసి డబ్బులు రాకపోతే అప్పులు చేసి, బ్యాంక్‌లు అప్పులు ఇవ్వక చనిపోయారన్నారు. భూమి మీద జగన్ అనే వ్యక్తి ఉన్నత కాలం ఈ రాష్ట్రం సర్వనాశనం అవుతుందంటూ వ్యాఖ్యలు చేశారు. "1983 నుండి నేను కాంట్రాక్టు చేస్తున్నాను. ఇంత దుర్మార్గమైన, రాక్షస రాష్ట్ర ప్రభుత్వం దగ్గర, జగన్ ప్రభుత్వం దగ్గర చేయలేదు. జగన్ పెట్టిన బాధలకు నేను అయితే 10 సార్లు సూసైడ్ చేసుకోవాలి. ఐదు సార్లు హార్ట్ ఎటాక్ వచ్చి బ్రతికిన వ్యక్తిని. ఈ జగన్ మోహన్ రెడ్డి ఎప్పుడు అసెంబ్లీకి వస్తాడా అని ఎదురు చూస్తున్న... పిలిపించండి. 2019-24 వరకు రాక్షస పాలన జరిగింది" అంటూ విష్ణుకుమార్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడ్కో హౌసింగ్ పై లఘు చర్చను విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. జగన్ చేసిన దోపిడీకి సంబంధించిన అంశంపై.. వైసీపీ నేతలు తాను చెప్పేది వింటే సిగ్గుతో చస్తారన్నారు. ప్రధాని ప్రతి ఇంటికి లక్షన్నర సబ్సిడీ ఇస్తాము అని చెప్పాక.. ఏపీకి 7 లక్షల 1 వెయ్యి 400 ఇళ్లను కేంద్రం కేటాయించిందని తెలిపారు. 5 లక్షలు ఇళ్లకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఇవ్వడంతో పాటు ఏపీ ప్రభుత్వం లక్షన్నర్ సబ్సిడీ ఇచ్చి టిడ్కో ద్వారా చేశారన్నారు. 5 లక్షలు ఇళ్లలో 4 లక్షల 54 వేల 706 ఇల్లకు టెండర్‌లు పిలిచారన్నారు. 3 లక్షలు 13 వేలు ఇళ్లు గ్రాంట్ అయితే.. నా ఎస్సీలు, బీసీలు అని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చాక 2 లక్షల 38 వేల 360 ఇళ్లు క్యాన్సిర్ చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ మారాక కాంట్రాక్టర్‌లకు పేమెంట్‌లు ఆపేశారని విష్ణుకుమార్ రాజు సభలో పేర్కొన్నారు.

# గుడివాడ టిడ్కో కాలనీ సమస్యలు పరిష్కరించాలి

● శాసనసభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
● కాలనీ నిర్మాణాలపై విచారణ జరపాలి
● భారీ ఎత్తున అవినీతి జరిగింది ● పారదర్శకత లేకుండా లబ్ధిదారుల ఎంపిక



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: టిడ్కో ఫ్లాట్ల పంపిణీ, సెంటు స్థలాల మెరకలో జరిగిన కోట్లాది రూపాయల అవినీతిపై విచారణ జరిపించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము డిమాండ్ చేశారు. కాలనీలోని దుర్భర పరిస్థితులను ఫోటోల రూపంలో అసెంబ్లీలో ప్రదర్శించి... ప్రజల కష్టాలకు వివరించారు. మొక్కుబడిగా పురపాలక సంఘానికి కాలనీని అప్పగించడంతో.. ప్రతిరోజు ప్రజలకు త్రాగునీరు అందించడం యజ్ఞంలా మారిందన్నారు. రాష్ట్రంలో నిర్మాణం పూర్తి చేసుకున్న అన్ని టిడ్కో లేఅవుట్లలో ఇవే సమస్యలు పునరావృతం అవుతాయని సహచర శాసనసభ్యులు అప్రమత్తం కావాలి కోరారు. ఏపీ అసెంబ్లీలో తొలిసారి మాట్లాడే అవకాశం కల్పించిన ఉప శాసనసభాపతి కృష్ణంరాజు.. సీఎం చంద్రబాబు..డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. 20 ఏళ్లుగా సర్వనాశనమైన గుడివాడ ఖ్యాతిని.. నిలబెట్టేందుకు అసెంబ్లీకి పంపిన గుడివాడ ప్రజలకు శిరస్సు వచ్చి నమస్కరిస్తున్నట్టు చెప్పారు. కేవలం ఎన్నికల ప్రచార ఆర్భాటానికే.. గుడివాడలో టీడ్కో ఫ్లాట్ల పంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా టిడిపి ప్రభుత్వ హయాంలో 8వేల 911 ఫ్లాట్ల నిర్మాణ పనులు గుడివాడలో 80% పూర్తయ్యాయని వివరించారు. ఐదేళ్ల పాలనలో.. టిడ్కో కాలనీలో మిగిలిన 20 శాతం పనులను.. పూర్తి చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కనీస మౌలిక వసతులను కూడా గత పాలకులు ఏర్పాటు చేయలేకపోయారని తెలిపారు. కనీస పారదర్శకత పాటించకుండా ఫ్లాట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గత సీఎం పాల్గొన్న తాళాల పంపిణీ కార్యక్రమంలో...కేవలం నిమ్మకాయ నీళ్లు, మజ్జిగ పంపిణీకు 28 లక్షలు ఖర్చు చేశారంటే.. ఏ స్థాయిలో అవినీతి జరిగిందో తెలుసుకోవాలన్నారు. టిడ్కో కాలనీలో ప్రస్తుతం 3వేల 900వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, గత ప్రభుత్వ తప్పిదాల వల్ల..నివాసితులకు కనీసం మంచినీరు..విద్యుత్.. పారిశుద్ధ్యం లాంటి కనీస వసతులు ఏర్పాటు చేయడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులకు..ఇబ్బందులు పడుతున్న ప్రజల అవసరాలను తీర్చేలా..ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు గుడివాడలో.. టీడ్కో ప్రాజెక్టు మంజూరు చేసిన.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు గుడివాడ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు.

# వైఎస్ అవినాష్ రెడ్డి అనుచరులంతా భూకబ్జాదారులే

● అవినాష్ కుటుంబ సభ్యులు 200 ఎకరాలు కబ్జా చేశారు ● విచారణ జరపాలి : బీటెక్ రవి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: భూకబ్జాలపై పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పులివెందుల నియోజకవర్గంలో భూకబ్జాలు చేశారని ఆరోపించారు. వైఎస్ అవినాష్ రెడ్డి కుటుంబ సభ్యులే తొండూరు మండలంలో 200 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించి సాగు చేశారన్నారు. ప్రభుత్వ భూమిని యాభై వేల రూపాయలు రేటు కట్టి కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేశారని మండిపడ్డారు. దీని పైన విచారణ జరిగితే ఎమ్మార్వోలు, రిజిస్టర్లు ఇంటికి పోతారన్నారు. వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ అంబాకపల్లి గ్రామంలో అటవి శాఖ భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటురన్నారని తెలిపారు. వైఎస్ అవినాష్ రెడ్డి ఆయన వెనకేసుకొస్తున్న వాళ్ళందరూ భూ ఆక్రమణలకు పాల్పడ్డారని మండిపడ్డారు. దేవిరెడ్డి శంకర్ రెడ్డి దొడ్ల వాగు గ్రామంలో 30 ఎకరాల భూమిని ఆక్రమించారన్నారు. పులివెందుల మున్సిపల్ చైర్మన్ డికెటి భూములు ఆక్రమించారని ఆ భూమి తనది కాదంటే తాము నిరుపేదలకు ఆ భూములు పంచుతామన్నారు.

# హైదరాబాద్ మెట్రో రైల్ సెకండ్ ఫేజ్‌లో ముందడుగు



- వేగవంతంగా ఓల్డ్ సిటీ మెట్రో రైల్ భూసేకరణ పనులు
- ఇప్పటికే భూసేకరణకు నోటీసులు ఇచ్చిన హైదరాబాద్ మెట్రో రైలు

తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః హైదరాబాద్ మెట్రో రైల్ సెకండ్ ఫేజ్ లో ముందడుగు పడింది. వేగవంతంగా ఓల్డ్ సిటీ మెట్రో రైల్ భూసేకరణ పనులు కొనసాగుతున్నాయి. ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న 7.5కిలోమీటర్ల మెట్రోమార్గానికి కావాల్సిన ఆస్తుల సేకరణకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో.. ఈ రూట్‌లో రోడ్డు విస్తరణ, స్టేషన్ల నిర్మాణానికి ఆస్తుల సేకరణ కీలకంగా మారింది. ఈ నేపథ్యంలోనే.. ఇప్పటికే ఇచ్చిన హైద్రాబాద్ మెట్రో రైలు అధికారులు భూసేకరణకు నోటీసులు ఇచ్చారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మెట్రో ఫేస్ 2 కారిడార్ ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు 200 ఆస్తులుకు (100 ఎల్‌హెచ్‌ఎస్, 100 ఆర్‌హెచ్‌ఎస్) డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంది. ఈరోజు ఆస్తులసేకరణకు డిక్లరేషన్ కు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిషెట్టి ఆమోదం తెలిపారు.

ఓల్డ్ సిటీ మెట్రో కారిడార్ కు రెండు వైపుల 100 చొప్పున 200 ఆస్తుల సేకరణకు ముందడుగు వేశారు అధికారులు. ఆస్తుల సేకరణ పూర్తి అయితే వాటికి అనుగుణంగా అవార్డు డిసెంబర్ నెల ఆఖరిలో ఆమోదించడం జరుగుతుందని, కొత్త సంవత్సరం జనవరి నెలలో మెట్రో రైలు పనులు ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు.

# గుజరాత్... గులాంలుగా మారారు

- మహారాష్ట్రలో ప్రజా తీర్పును ఏక్ నాథ్ శిండే అజిత్ పవార్ కాలరాశారు శిండే
- అజిత్ పవార్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు




తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః శిండే.. అజిత్ పవార్ గుజరాత్ గులాంలుగా మారారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర చంద్రాపూర్ నియోజవర్గం గుగ్గూస్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు.? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. ఏడాది కాలంలో తెలంగాణలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చామని క్లారిటీ ఇచ్చారు. ఈ దేశంలో గుజరాత్ సహా ఏ రాష్ట్రంలోనూ ఏడాది కాలంలో 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. మహారాష్ట్రలో ప్రజా తీర్పును ఏక్ నాథ్ శిండే అజిత్ పవార్ కాలరాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శిండే.. అజిత్ పవార్ గుజరాత్ గులాంలుగా మారారని కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రాపూర్ లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రవీణ్ పడ్ వేకర్ ను 50 వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ ప్రవీణ్ ను గెలిపిస్తే మీకు ఇక్కడ ఒక అన్న ఉంటారు%ా హైదరాబాద్ లో మరో అన్నగా నేను ఉంటా అన్నారు. ఇక రేపు ఇక రెండోరోజు ఆదివారం ఉదయం నాగ్‌పూర్ నుంచి నాందేడ్ చేరుకుంటారు. నయగావ్, భోకర్, షోలాపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ప్రచారం అనంతరం అక్కడి నుంచి మళ్లీ హైదరాబాద్ కు తిరిగి రానున్నట్లు తెలుస్తుంది. ఈ నెల 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది.

ఈ నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి, విపక్ష ఇండియా కూటమి గెలుపు కోసం శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ తరపున ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ప్రచారం చేస్తున్నారు. ఎన్డీయే కూటమి తరపున ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రచారం చేస్తున్నారు. తెలుగువారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎన్డీయే నుంచి కేంద్రమంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రచారంలో సందడి



చేశారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే ముంబైలో బీజేపీ నేతలు తమ మిత్రపక్షం ఏపీ సీఎం చంద్రబాబు బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను ప్రచారానికి ఆహ్వానించారు. ఈనేపథ్యంలో నేడు పవన్ కళ్యాణ్ ప్రచారం చేపట్టారు.

## రామోజీరావు జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: విలువలతో కూడిన జర్నలిజానికి నిదర్శనంగా నిలిచిన బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. రామోజీరావు జయంతి సందర్భంగా నివాళులర్పించారు. "అడుగు పెట్టిన ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. మీడియా మొదలుకుని అనేక రంగాల్లో వారు వేసిన బాటలు నేటికీ ఆదర్శంగా, ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. వ్యక్తిగా మొదలై శక్తిమంతమైన వ్యవస్థగా ఎదిగిన రామోజీరావు జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం" అని వెంకయ్యనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.

## చంద్రబాబు సోదరుడి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో/ప్రతినిది: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు ఈ మధ్యాహ్నం కన్నుమూసిన సంగతి తెలిసిందే. తీవ్ర అనారోగ్యంతో హైదరాబాదులోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గుండెపోటుకు గురయ్యారు. రామ్మూర్తినాయుడ్ని బతికించేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, ఆయన తుదిశ్వాస విడిచారని ఏఐజీ వర్గాలు ప్రకటన విడుదల చేశాయి. రామ్మూర్తినాయుడి మృతిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి మృతి దిగ్భ్రాంతికరం అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. రామ్మూర్తినాయుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## సీఎం రేవంత్ వాహనంలో మహారాష్ట్ర పోలీసుల తనిఖీలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిమిత్తం అక్కడకు వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేదు అనుభవం ఎదురయ్యింది. చంద్రపూర్ నియోజకవర్గం గుగూస్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వెళ్తున్న సందర్భంలో మహారాష్ట్ర పోలీసులు రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న వాహనాన్ని నిలిపి తనిఖీ చేశారు. మహారాష్ట్రలో ప్రస్తుతం ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ప్రతి పార్టీ కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు.. సీఎం రేవంత్ రెడ్డి వాహనాన్ని తనిఖీ చేయడం హాట్ టాపిక్ గా మారింది. మహారాష్ట్రలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్ధతుగా ఎన్నికల సభలో పాల్గొనేందుకు శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో నాగ్ పూర్ కు చేరుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. అక్కడి నుంచి చంద్ర పూర్ లోని గుగూస్ లో ఏర్పాటు చేసిన సభకు రోడ్డు మార్గంగా వెళ్తున్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డిని ఆపి పోలీసులు తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీ జరుగుతున్నంత సేపు సీఎం రేవంత్ రెడ్డి వాహనం లోనే కూర్చున్నారు. పోలీసులకు పూర్తిగా సహకరించారు సీఎం. ఎన్నికల సమయంలో వాహన తనిఖీలు సహజమే అయినా.. సీఎం స్థాయి వ్యక్తులను ఆపి తనిఖీ చేయడం అరుదుగా జరుగుతుంది.

# మహా వికాస్ అఘాడీ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరు



తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడిదే అంతిమ విజయం అని రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖామంత్రి , ఏ.ఐ.సి.సి ఎన్నికల పరిశీలకులు కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఈ ఎన్నికల ఫలితాల భారతదేశం రాజకీయాలను మలుపు తిప్పనున్నాయని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో మరట్వాడ ప్రాంతానికి ఏ.ఐ.సి.సి సీనియర్ పరిశీలకుడిగా నియమితులైన రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తో కలసి ముఖ్ హెడ్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మహావికాస్ అగాఢీ కూటమి 200 పై చిలుకు స్థానాలలో గెలుపు సాధించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 స్థానాలకు గాను 31 స్థానాల్లో ఎంవీఏ కూటమి సాధించిన విజయమే ఇందుకు తార్కాణమని ఆయన గుర్తు చేశారు.కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలన్నింటిని అమలు పరుస్తున్నామన్నారు. తెలంగాణలో హామీలపై.. తెలంగాణాలో 1.05 కోట్ల మహిళలు ఉచిత బస్ ప్రయాణం,500 రూపాయల సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లు,50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ వంటి హామీలను కాంగ్రెస్ నెరవేర్చిందన్నారు.ఈ కార్యక్రమాలు మహారాష్ట్రలో ఎంవీఏ పాలనకు నమూనా బ్లుప్రింట్ గా నిలుస్తాయన్నారు.మహారాష్ట్ర-తెలంగాణా రాష్ట్రాల నడుమ లెండి సచ ప్రాజెక్టు ను నిర్మించ నున్నట్లు ఆయన వెల్లడించారు.

ఉభయ రాష్ట్రాల రైతాంగానికి ఈ ప్రాజెక్టు ప్రయోజనం చేకూరుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టులు గుజరాత్‌కు తరలింపు.. రాజకీయం- ఉప ముఖ్యమంత్రికి సీఎం కుర్చీ ఆఫర్" బీజేపీ విభజన రాజకీయాలను ఆయన తూర్పారాబట్టారు.మహారాష్ట్రలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి చేసిన తప్పిదాలపై ఆయన మండిపడ్డారు.మహారాష్ట్ర లోని ప్రధాన పారిశ్రామిక ప్రాజెక్టులను గుజరాత్ కు తరలించి మహారాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలకు నష్టం కలిగించిన బీజేపీ కూటమని ఇక్కడి ప్రజలు తిరస్కరిస్తున్నారని ఆయన చెప్పారు.అధికారంలోకి వస్తే అమలు పరచనున్న ఐదు గ్యారెంటీలను ఆయన వివరించారు.

# మూసీ మే లూటో.. ఢిల్లీ మే బాటో

## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: మూసీ మే లూటో ఢిల్లీ మే బాటో అనే విధంగా ఉన్నది కాంగ్రెస్ నేతల తీరు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సీఎం కుర్చీ ఉండాలంటే ఢిల్లీకి మూటలు పంపాలి.. అందుకే మూసీలో డబ్బులు లూటీ చేసి, బ్యాగులు ఢిల్లీకి పంపుతున్నాడని కేటీఆర్ విమర్శించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటింది. ఢిల్లీ వాళ్లకు కోపం వస్తే పదవి ఎప్పుడు ఊడుతుందో తెలియదు. రాహుల్ గాంధీకి డబ్బులు కావాలి. ప్రియాంక గాంధీ కూడా ఉన్నారు. వాళ్లకు డబ్బులు పంచాల్సిందే. అందుకే మూటలు పంపే పనిలో ఉన్నారని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో పదేళ్లలో భారీగా భూముల ధరలు పెరిగాయి. అప్పుడు మేము పారదర్శకంగా భూముల వేలం వేస్తే ఒక ఎకరాకు వందకోట్లు పోయింది. అప్పుడు కూడా అందులో స్కాం ఉందని రేవంత్ రెడ్డి ఆరోపణలు చేశాడు. ఓఆర్ఆర్ లీజును ఒక సంస్థకు రూ. 7 వేల కోట్లకు ఇస్తే లక్ష కోట్లు వచ్చేదాన్ని రూ. 7 వేల కోట్లే ఇచ్చారన్నాడు. మరీ ఇప్పుడు మున్సిపల్ మినిస్టర్ నువ్వే కదా? ఆ టెండర్ రద్దు చేసి రూ. లక్ష కోట్లు తీసుకురా. నేను కోకాపేట భూముల్లో అవినీతి చేశానని అన్నావ్. విచారణ జరుపు. తప్పు చేస్తే శిక్ష వేయ్ అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు

**దేవుళ్లనే మోసం చేసిన మొదటి వ్యక్తి రేవంత్ రెడ్డి...**

రుణమాఫీ విషయంలో దేవుళ్లను కూడా వదలకుండా ఏ దేవుని దగ్గరకు పోతే అక్కడ ఒట్లు వేశాడు రేవంత్ రెడ్డి. దేవుళ్లను మోసం చేసిన మొదటి వ్యక్తి ఈ రేవంత్ రెడ్డినే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కొన్ని సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నాయి. ఎత్తైన కుర్చీలు వేసుకుని కూర్చుంటున్నారు.

లేదంటే రెండు కుర్చీలు వేసుకుని కూర్చుంటున్నారు. ఎత్తయిన కుర్చీలో కూర్చొంటే పెద్దోడివి అయిపోవు రేవంత్ రెడ్డి. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవాలి అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు ఇస్తా అన్నాడు. దాని కోసం రాష్ట్ర రైతాంగం ఎదురుచూస్తోంది. మూడు పంటలకు రైతు భరోసా ఎక్కడ పోయింది. వానాకాలం రైతుబంధు ఇంకా ఖాతాల్లో పడలేదు. రైతున్నలు మోసపోయామని బాధపడుతున్నారు. రుణమాఫీ 2 లక్షలు చేస్తానని చెప్పి మోసం చేశావు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని మాటిచ్చి తప్పావు. ఇక ఆ తర్వాత ఏ దేవుడి వద్దకు వెళ్తే..




అక్కడ ఒట్లు. నిన్న దేవుళ్లందరూ మీటింగ్ పెట్టుకున్నారట.. వీడు ఎక్కడ దొరికిండ్రా నాయనా.. మనకు ఏడ కనబడితే అడ ఒట్లు వేస్తున్నాడని అనుకున్నారంట. మనషులను మోసం చేసిన వారు ఉన్నారు. దేవుళ్లను మోసం చేసిన తొలి వ్యక్తి ఈయనే. పంద్రాగస్టు లోపు రుణమాఫీ అంటివి. ఎగిరెగిరిపడితివి. హరీష్ రావుతో సవాల్ చేస్తివి. ఇప్పుడు ఏమైంది? మరి ఏడ పోయింది రుణమాఫీ.. జేపీ దర్గా వద్ద కూడా ఒట్టు పెడితివి. నీ ఒట్లకు మెదక్ చర్చిలో యేసుక్రీస్తు కూడా బాధపడుతున్నాడు అని కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆఫీస్‌కు లగచర్ల గ్రామస్థులు

- వారికి మద్దతుగా బీఆర్ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై దాడి జరిగిన ఘటన ఎంతటి దుమారాన్ని రేపిందో అందరికీ తెలిసిందే. ఈ దాడికి సంబంధించి ఇప్పటికే అనేక మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంకా అరెస్ట్‌ల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇదిలా ఉండగా లగచర్ల దాడి నిందితుల కుటుంబసభ్యులు ఈ ఘటనపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. నిందితుల కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, తదితరులు మద్దతు తెలుపుతూ కమిషన్ కార్యాలయానికి వచ్చారు. తమ భూములను కోల్పోతున్నామని కమిషన్ దృష్టికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. ఐదు గ్రామల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా పోలీసులు అక్రమ కేసులు పెట్టి తమ కుటుంబ సభ్యులను జైల్లో పెట్టారని కమిషన్‌కు కుటుంబసభ్యులు తెలిపారు. మరోవైపు.. లగచర్ల దాడి ఘటనలో అరెస్ట్‌ల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో అనేక మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తాజాగా మరికొందరిని కూడా అరెస్ట్ చేశారు.

ఆరుగురిని అదుపులోకి తీసు కున్న పోలీసులు.. వారిని కొడంగల్ పోలీస్‌స్టేష్ నుంచి పరిగి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వీరందరినీ సాయంత్రం వరకు రిమాండ్ చేసే అవకాశం ఉంది. అలాగే ఈ కేసులో మరికొందరి కోసం కూడా పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో సహా మొత్తం 21 మందిని రిమాం డ్‌కు తరలించారు. . సంగారెడ్డి జైల్లో 20 మందిని ఉంచగా.. నరేందర్ రెడ్డిని చర్లపల్లి జైలుకు తరలించారు. మొదట పరిగి సబ్ జైల్లో 16 మందిని రిమాండ్ చేయగా.. మరో నలుగురిని నేరుగా సంగారెడ్డి జైల్లోకి తరలించారు. పరిగిలో రిమాండ్ అయిన 16 మందిని సంగారెడ్డి జైలుకు ట్రాన్స్ఫర్ చేశారు. ఇప్పటికే మొత్తం 21 మంది రిమాండ్‌కు తరలించారు. ఇప్పుడు తాజాగా మరో ఆరుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు.

## కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆహ్వానం మేరకు తేదీ 16.11.2024 నాడు ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మరియు కమిషన్ సభ్యులతో టి పి టి ఎఫ్ రాష్ట్ర కమిటీ విద్యారంగంలో తీసుకరావల్సిన మార్పుల గురించి చర్చించడం జరిగింది. విద్యా విధానంపై కొన్ని ప్రతిపాదనలు చేస్తూ ఒక రిపోర్టును కమిషన్కు అందించడం జరిగింది. ఈ సమావేశంలో టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగం సంక్షోభంలో ఉందని, మినిస్టర్ పిల్లలైనా, అటెండర్ పిల్లలైనా, కలెక్టర్ పిల్లలైనా, కార్మికుల పిల్లలైనా ఒకే పాఠశాలలో చదువుకునే కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానంను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని, పాఠశాల కరికులంలో శాస్త్రీయ విద్యా విధానానికి అనుగుణంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలలో జరిగిన అభివృద్ధిని పాఠ్యాంశాలలో చేర్చాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచర్ను, తరగతికి ఒక గది మరియు ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుల పోస్ట్ ను మంజూరు చేయాలని కోరారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేస్తూ పూర్వ ప్రాథమిక విద్య పై శిక్షణ పొందిన రెగ్యులర్ టీచర్ను నియమించాలని, పాఠశాలలో ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించకూడదని, ఆన్లైన్ క్లరికల్ వర్క్ లేకుండా చేయాలని కోరారు. మండల,జిల్లా,జోనల్ స్థాయిలో రెగ్యులర్ పద్ధతిలో వెంటనే పర్యవేక్షణాధికారులైన డిఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు.

అకాడమిక్ క్యాలెండర్ అమలయ్యేలా చూస్తూ క్యాలెండర్ కు భిన్నంగా వివిధ జిల్లాలలో తీసుకు వస్తున్న అదనపు కార్యక్రమాలను లేకుండా చేయాలని, రాష్ట్ర బడ్జెట్లో విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాల భారం తగ్గిస్తూ మార్పులు చేయాలని కోరడం జరిగింది.నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం నెల నెలా చెల్లించాలని, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం స్నాక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి యం.రవీందర్ ఉపాధ్యాయ దర్పిని ప్రధాన సంపాదకులు ఎం ప్రకాష్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి, డి.శ్రీనివాస్, రాష్ట్ర ఏపీటీఎఫ్ చేసి లైట్ మార్జిన్ కాల్ అధ్యక్షులు కె.వేణుగోపాల్, టి పి టి ఎఫ్ మాజీ అధ్యక్షులు బి కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని స్వాతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కొత్తలాపూర్ బిసి బాలికల గురుకుల పాఠశాలలో ఈరోజు ఉదయం 6 గంటలకు 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని స్వాతి అనుమానస్పదంగా మృతి చెందింది. స్వాతి మృతి పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి కావున విచారణ జరిపించి ఆమె మృతికి కారకులైన వారందరినీ చట్టపరంగా శిక్షించాలని బాధ్యతారాహిత్యంగా ఉన్న పాఠశాల ప్రిన్సిపాల్ ని సస్పెండ్ చేయాలని, స్వాతి కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి, వారి కుటుంబానికి రెండు పడక గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని పి.డి.ఎస్.యూ డిమాండ్ చేస్తా ఉంది. గురుకుల పాఠశాలలలో ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం పిల్లల మానసిక పరిస్థితులను పాఠశాల యాజమాన్యం నుంచి ఎదురవుతున్న ఒత్తిడీలను అడిగి తెలుసుకోకుండా సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న ఉన్నతాధికారుల పైన చర్యలు తీసుకోవాలని, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీ గురుకులాలలో ఇప్పటికే పదుల సంఖ్యలో చనిపోతున్న ప్రభుత్వం దృష్టి సారించకపోవడం సిగ్గుచేటు అన్నారు ఇకనైనా ప్రభుత్వం గురుకుల పాఠశాల మరణాలపై విచారణ జరిపించాలని చనిపోయిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

# గాలిలో దీపంలా చదువులు

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూతపడుతున్న కాలేజీలు
- మధ్యలోనే చదువులను మానేస్తున్న పేద విద్యార్థులు
- 16లక్షల75వేలమంది విద్యార్థుల ఫీజులు చెల్లించాలి
- విద్యార్థులకు ప్రభుత్వం భరోసా కల్పించాల్సి పోయి - ఆటంకం కలిగించడమా
- నిధుల విడుదలకు అడ్డుకట్ట వేస్తూ కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు
- విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు చెల్లించరా
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య



తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల చదువులు గాలిలో దీపంలా మారాయని, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోడంతో ఆయా కాలేజీలు మూత పడుతున్నాయని, దీంతో విద్యార్థులు చదువు మానేయడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ సంఘం పిలుపు మేరకు బీసీ సంఘాల నేతలు, విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలను చేపట్టారు. జిల్లా కలెక్టరేట్ల ముట్టడితో పాటు, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాల మందు నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు అందులో భాగంగా శనివారం 16లక్షల75వేలమంది విద్యార్థుల ఫీజులు చెల్లించాలని, "కాంట్రాక్టర్ల బిల్లులు వేలకోట్లు చెల్లిస్తున్నారు - విద్యార్థుల స్కాలర్షిప్ బిల్లులు వందల కోట్లు కూడా చెల్లించడం లేదు. ఇదేమి న్యాయం - ఇదేమి ప్రభుత్వం అంటూ నినాదాలు ఇస్తూ విద్యార్థులు మహా ర్యాలీ ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య ప్రసంగిస్తూ గత నాలుగు నెలలుగా విద్యార్థులు రోడ్లమీద వచ్చి ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆర్థిక శాఖ మంత్రికి కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉంది. కానీ విద్యార్థులు అంటే పట్టించుకోవడం లేదు. తన వైఖరి మార్చుకోకపోతే తీవ్రంగా తిరుగుబాటు జరుగుతుందని హెచ్చరించారు. గతంలో స్కాలర్ షిప్ లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు నాలుగు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీ బంద్ చేస్తే విద్యార్థుల చదువు దెబ్బ తింటుందని కాలేజీ యాజమాన్యాలకు నచ్చజెప్పి పునః ప్రారంభ చేసాము. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11నెలలు నడుస్తున్న ఇంతవరకు బకాయిలు చెల్లించడానికి ముందుకు రావడంలేదని విమర్శించారు. ఈ 11 నెలల కాలంలో ప్రభుత్వం తెచ్చిన అప్పులు 80వేల కోట్లతే ఆదాయం ఏంటంటే ఒక లక్ష కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో కాంట్రాక్టర్లకు ఎంత చెల్లించారు? ఇతర బిల్లులు ఎన్ని చెల్లించారో శ్వేతపత్రం విడుదల చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్కాలర్ షిప్‌లు, ఫీజుల బకాయిలు 4వేల కోట్లు తక్షణమే చెల్లించాలని కోరారు. ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలేజీ యాజమాన్యాలు కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత కోర్సులలో సీట్లు వచ్చిన చదవలేక పోతున్నారు. అలాగే ఉద్యోగాలు వచ్చిన సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు కోల్పోతున్నారు. విదేశీ విద్యకు పోలేక పోతున్నారు. ఫీజులు కట్టే సోమత లేని వారు. ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు, నూనెలు, పప్పులు, కూరగాయలు అన్ని ఆహార వస్తువుల ధరలు రెండు రెట్లు -మూడు రెట్లు పెరిగాయి. ఇలా పెరగడంతో హాస్టల్ మరియు గురుకుల పాఠశాల విద్యార్థులకు నాసిరకం ఆహారం పెడుతున్నారు. ధరలు పెరుగడంతో హాస్టల్ "మెను" పాటించడానికి డబ్బులు సరిపోవడంలేదని గుడ్లు, పండ్లు తగ్గించారు. మరల హాస్టల్ విద్యార్థుల కష్టాలు ప్రారంభమయ్యాయి. ఉద్యోగుల జీతాలు రెండు సార్లు పెంచారు. శాసనసభ్యులు, మంత్రుల జీతాలు మూడురెట్లు పెంచారు. వృద్ధాప్య ఫెన్షన్లను ఐదు రెట్లు పెంచారు. కాని ఎస్సీ/ఎస్టీ/మైనార్టీ విద్యార్థుల స్కాలర్ షిప్ లు పెంచలేదు. ప్రస్తుతం ఇస్తున్న స్కాలర్ షిప్ లు 12 సంవత్సరాల క్రితం నిర్ణయించారు. అప్పటి పెంపుదల కూడా శాస్త్రీయంగా లేదు. యూనివర్సిటీ విద్యార్థులు మెస్ బిల్లు రూ? 2800/- లు వస్తుంటే స్కాలర్షిప్పు రూ? 1500 లు మంజూరు చేస్తున్నారు. పైగా ఈ మధ్యకాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. పెరిగిన ధరల ప్రకారం స్కాలర్ షిప్ లు పెంచవలసిన ఆవశ్యకత ఉందని కృష్ణయ్య తెలిపారు. రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో బీసీ నేతలు వెంకన్న, జిల్లపల్లి అంజి, సి.రాజేందర్, అనంతయ్య, పగిళ్ల సతీష్, నిఖిల్ తదితరులతో పాటు వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**Invesco Mutual Fund**

The details of upcoming Investor Awareness Program(s) ('IAP') are as follows:

| Date | Time | Meeting ID | Passcode |
|---|---|---|---|
| November 21, 2024 | 4.00pm | 275 308 212 192 | Dx2dv2 |

Those who are interested to attend IAP are requested to email the details to us at iap@invesco.com

Date: November 17, 2024

Mutual Fund investments are subject to market risks, read all scheme related documents carefully.

మొన్నటికి మొన్న రోహిత్ శర్మ సారథ్యం లోని భారత సీనియర్ జట్టు తమ సొంత దేశంలోనే న్యూజిలాండ్ జట్టుతో టెస్ట్ సిరీస్ ను కోల్పోయి అశేష భారత క్రికెట్ అభిమానులను అత్యంత తీవ్రంగా నిరాశపరచిన విషయం మనందరికి విధితమే. అయితే ఆ చేదు అనుభవాన్ని, ఫలితాన్ని మరచేలా సూర్యకుమార్ సారథ్యంలోని మన భారత యువ జట్టు ఎట్టకేలకు సౌతాఫ్రికా జట్టుపై వారి స్వంత గడ్డపైనే నాలుగు మ్యాచ్ ల టి 20 సిరీస్ ను 3 – 1 తేడాతో చేజిక్కించుకొని,అందరి చేత శెభాష్ అనిపించుకుంది. ముఖ్యంగా ఈ టి 20 సిరీస్ లో మన భారత యువ జట్టు బ్యాటింగ్,బౌలింగ్,ఫీల్డింగ్ ఇలా మూడు రంగాలలో తన సత్తా చాటి సఫారీ జట్టు భరతం పట్టడం కోట్లాది మంది మన భారతదేశ క్రికెట్ అభిమానులను ఆనందసాగరంలో,సంతోష డోలికల్లో ముంచెత్తింది అనే మాట సత్య దూరం కాదు. అదేవిధంగా ఈ నాలుగు మ్యాచుల టీ 20 సిరీస్ ను గెలవాలంటే ఖచ్చితంగా నెగ్గాల్సిన ఈ 4 వ టి 20 మ్యాచ్ లో హైదరాబాద్ క్రికెటర్ ఠాగూర్ తిలక్ వర్మ, సంజు సామ్సన్ లు సౌతాఫ్రికా బౌలింగ్ శ్రేణిని ఊచకోత కోస్తూ,చీల్చి చెండాడుతూ చెరో సెంచరీతో కదం తొక్కడంతో టీం ఇండియాకు విజయం అనేది నల్లేరు మీద నడకే అయ్యింది. ఇక వీరిద్దరి అసాధారణ, అన్యూహమైన బ్యాటింగ్ ప్రతిభతో టీం ఇండియా

## అదరగొట్టిన టీం ఇండియా!

టి 20 ల్లో రెండో అత్యధిక స్కోరు 283 పరుగులు నమోదు చేసింది. అంతకుముందు అంటే గత నెలలో బంగ్లాదేశ్ జట్టుపై మన భారత యువ జట్టు టి 20 ల్లో 297 పరుగుల రికార్డు స్కోరు నమోదు చేయగలిగింది. ఇక భారత జట్టు బౌలింగ్ విషయానికి వస్తే స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి,బిష్ణోయ్,అక్షయ్ కుమార్ లు తమ తమ స్పిన్ బౌలింగ్ లలో మంచి వాడి,వేడి ప్రదర్శించడం,మ్యాజిక్ చేయడం, పేసర్లు అర్ష్ దీప్,రమణ దీప్ లు కూడా తమ శక్తి మేర రాణించడం,అల్ రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా పర్వాలేదానిపించడం వెరసి సౌతాఫ్రికా వంటి పటిష్ట,ప్రొఫెషనల్ జట్టుపై సూర్య కుమార్ సారథ్యంలోని భారత యువ జట్టు టి 20 సిరీస్ విజయాన్ని నమోదు చేయడం అనేది యావత్తు భారత క్రికెట్ కు ఓ గొప్ప శుభ పరిణామం వంటిది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఏదిఏమైన ఈ మధ్య కాలంలో టి 20 మ్యాచుల్లో అన్ని జట్లపై మన యువ భారత క్రికెట్ జట్టు అడపదడప కొన్ని జట్లపై ఓటములు చవిచూసిన అంతిమంగా మాత్రం ఎక్కువగా విజయలనే ఈ టి 20 ఫార్మాట్ లో నమోదు చేసింది అనే మాట అక్షర సత్యం. అందుకు ప్రదాన కారణం ఎంతో ప్రతిభ గల యువ క్రికెటర్లు ఎంతో పోటీ వున్న ఈ క్రికెట్ రంగంలోకి ఓ తుఫానులా దూసుకువచ్చి తమ తడాఖా చూపుతుండటం ఎంతైనా భారత క్రికెట్ భవిష్యత్తుకు ఎంతో మేలు చేకూర్చేదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏమైనా ఎన్ని విధాలుగా చూసిన సౌతాఫ్రికా వంటి అగ్రశేణి జట్టుపై మన భారత జట్టు వారి స్వంత గడ్డపైనే టి20 సిరీస్ నెగ్గడం అనేది ఎంత మాత్రం అషామాషి వ్యవహారం కాదు,ఇది ఖచ్చితంగా ఛాంపియన్ ఆటతీరు క్రిందకే వస్తుంది అనే మాట సత్య దూరం కాదు. అన్నింటికి మించి ఈ టి 20 ఫార్మాట్ లో సూర్యకుమార్ సారథ్యంలోని మన భారత యువ జట్టు అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ ఓ అజేయ,ఆఖండ శక్తిగా ఆవిర్భవించడం,మిగతా అన్ని అగ్రశేణి జట్లపై సై అంటే సై,డీ అంటే డీ అనేలా ఓ బలీయమైనా జట్టుగా మన భారత యువ జట్టు తయారు అయ్యి ఎంతటి బలమైన జట్టుకు అయినా సవాల్ విసిరే స్థాయికి చేరుకోవడం ఎంతైనా అభినందనీయం. జయ జయహో భారత యువ జట్టు! హ్యాట్సాఫ్ టూ టీం ఇండియా

## అధ్యక్షా ! అనలేకనే అసెంబ్లీకి డుమ్మా !

గౌరవనీయ అయ్యన్నపాత్రుడుగారు స్పీకరు గాను , గౌరవనీయ రఘురామ కృష్ణం రాజుగారు ఉపసభాపతిగాను ఆ స్పీకరు స్థానములో ఉన్నపుడు , జగన్మోహన రెడ్డి ఖచ్చితంగా అధ్యక్షా అని సంభోదించవలసిందే !గత అరాచకపాలనలో జగన్ చేసిన దుర్మార్గాలను ఎండగట్టి , ఉతికి ఆరేసినవారు ఈ ఇద్దరే !ముఖ్యంగా త్రిబులార్ ను అక్రమంగా అరెస్టుచేసి , చిత్రహింసలకు గురిచేసినతరువాత , టీవి చానల్స్ లోనూ , రచ్చబండ కార్యక్రమాలలోను , అప్పటిముఖ్యమంత్రి వికృతచేష్టలను కళ్లకుకట్టినట్లు చెప్పి , రాష్ట్రప్రజలను చైతన్యపరచిన విధానము అద్భుతం.

అలాగే ఏనేరము చేయకపోయినా , ఏతప్పు చెయ్యకపోయినా అక్రమంగా అన్యాయంగా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబుగారుని 53 రోజులు జైలులో పెట్టి క్షోభకు గురిచేసిన సంఘటనకూడా జగన్ కు గుర్తొచ్చి , వీళ్ల ముఖాలు చూడలేక కూడా అసెంబ్లీకి జగన్ డుమ్మాకొట్టి ఉండవచ్చు.

సరే మిగిలిన పదిమంది రావచ్చుకదా !

నార్నెవెంకటసుబ్బయ్య . 9290617819


పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా మన భారతావని

■ ఈ పవిత్రక్షణంలో దేశ సేవకు అంకితమవుతామనే ప్రతిజ్ఞ చేద్దాం ■ సాంకేతిక రంగాల్లో మనం అగ్రరాజ్యాలకు దీటుగా వుండాలనే సంకల్పం ■ ప్రభుత్వాలెన్ని చేసినా పేదరికపు చావులు, బాలకార్మిక వ్యవస్థలు మారట్లే ■ పిల్లలను ప్రభుత్వ బడులు,కళాశాలల్లో చేర్పించడంలో కనిపించని ఆసక్తి ■ పర్యావరణ పరిరక్షణలో నేటి యువతరం పాఠాలు నేర్వాలి

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536




"యావత్ ప్రపంచం నిద్రిస్తున్న వేళ, అర్ధరాత్రి సమయంలో భారతదేశం తన స్వతంత్ర్య జీవనానికై మేల్కొంది . భారతదేశం కొరకు,మన ప్రజల కొరకు ముఖ్యంగా మానవజాతి సేవకు అంకితమవుతామనే ప్రతిజ్ఞకై ఈ పవిత్రక్షణంలో మనమంతా అడుగేద్దాం!"అంటూ ఆగష్టు 15,1947 న మన స్వాతంత్ర్య భారత తొలి ప్రధాని మరియు విదేశాంగమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జాతినుద్దేశించి ప్రసంగించారు .సుసంపన్న కుటుంబం,ఉన్నత విద్యాభ్యాసపు నేపథ్యం వున్నప్పటికీ, స్వాతంత్ర్య సమరంలో జైలు జీవితాన్ని ఆనందంగా గడుపుతూ,"మహర్షి వంటి వాడైన మా ప్రియతమ నాయకుడు గాంధీజీ కి శిక్ష విధించిన తర్వాత జైలు మాకు స్వర్గమైంది. పవిత్రమైన యాత్రాస్థలమైంది" అంటూ తన జీవితాన్ని మనదేశం కోసమే త్యాగం చేసిన విశ్వ శాంతి కాముకుడు, మహాత్ముడి దార్శనికతను ఆచరించిన ఓ భారతరత్నం జవహర్ లాల్ నెహ్రూ. అభివృద్ధి చెందిన భారత్ గా మనం ఎదగాలని బాలలను,యువకులను కుల, మతాలకతీతంగా అందరికీ సమాన విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు కల్పించేలా ఎంతో కృషి చేశారు."నేటి బాలలే రేపటి పౌరులు" అంటూ చాచా నెహ్రూ గా మన త్రివర్ణ పతాకం సాక్షిగా నేటికీ స్ఫూర్తినిస్తూనే వున్నారు. ఐఐటి, ఎయిమ్స్,ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థల స్థాపనలో నెహ్రూ కీలకంగా వ్యవహరించారు. విఖ్యాత భారతీయ శాస్త్రవేత్తలు సివిరామన్, విక్రమ్ సారాభాయ్, హొంజహాంగీర్ బాబా వంటి ప్రముఖులతో కలిసి శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అగ్రరాజ్యాలకు దీటుగా వుండాలనే సంకల్పంతో ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలను తీసుకొని దేశాన్ని ముందుకు నడిపారు. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య కు పునాది వేశారు.

ప్రాక్టికల్ గా, నిజాయితీగా మాట్లాడుకుంటే ఎన్నో రాజకీయ పార్టీలు, నాయకులు 78 సంవత్సరాల స్వాతంత్ర్య భారతంలో ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూనే వున్నా పేదరికపు చావులు, బాలకార్మిక వ్యవస్థలు ఇంకా వున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో అందరికీ సమాన విద్యావకాశాలు అందటం లేదు. చాలా వరకు సామాన్య ప్రజలు మొదలుకొని రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉన్నత అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు సైతం ప్రభుత్వరంగంలో ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి చూపిస్తున్న ఆసక్తిని తమ పిల్లలను ప్రభుత్వ బడులు, కళాశాలల్లో చేర్పించడంలో కనపడటం లేదు. దీనిపై మేధావులు, విద్యావేత్తలు, సామాన్య ప్రజలు దేశ స్థాయిలో చర్చలు జరిపి లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం వుంది. విద్యలో పెరుగుతున్న అంతరాలను తగ్గించి ,మార్పులను స్వాగతించాల్సిన సమయం ఆసన్నమైంది. కొంత మంది చేతిలో కొంతమేరలో విద్య కార్పోరేట్ అయ్యింది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కొన్ని కోట్ల మంది పిల్లలకు అవకాశాలే లేక ఐఐటీ,మెడిసిన్, ఐఎఎస్ వంటివి అందని అంతరిక్షపు తారలయ్యాయి. అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలు మరియు పరిశోధనలు మనదేశంలో పెద్దగా కనిపించటం లేదని ఎన్నో రీసెర్చ్ సంస్థల గణాంకాలే చెబుతున్నాయి. నెహ్రూ కలలు గన్న భవిష్యత్తు భారతపు బాల్యం సమస్యల వలయంలోనే కొట్టుమిట్టాడుతుందనే చెప్పవచ్చు.

నెహ్రూ తనజీవితాంతం గాంధీజీ చూపిన అహింసా మార్గంలో శాంతియుత విధానాలతో ముందుకు నడిచారు. యుద్ధం వల్ల కలిగే రక్తపుటేరులను తీవ్రంగా వ్యతిరేకించారు. దేశాలమధ్య ద్వేషాలు కాకుండా ప్రేమ కుసుమాలు వికసించాలని కాంక్షించారు. నేడు కొన్ని దేశాలమధ్య అధిపత్య పోరులో జరుగుతున్న యుద్ధాల వల్ల లక్షలాది పిల్లలు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. భయానక పరిస్థితుల్లో ఆకలితో అలుమటిస్తున్నారు. బాల్యం బానిసత్వంలోనే గడుపుతున్నారు. అలాంటి ప్రస్తుత తరుణంలో "ది డిస్కవరీ ఆఫ్ ఇండియా" అంటూ తన ఆలోచనలకు అక్షరరూపం ఇచ్చిన నెహ్రూ స్వప్నించిన విశ్వశాంతికై మనం నడవాలి. యుద్ధాలులేని స్వేచ్ఛా విజ్ఞాన శాస్త్ర ప్రపంచంలో భవిష్యత్తు బాలలు, రేపటి తరాలు జీవించేలా చూడటం మనందరి బాధ్యతగా స్వీకరించాలి. నెహ్రూ మొదటి ప్రధానమంత్రి గా సుదీర్ఘ కాలం పాటు కొనసాగటంతో పాటు,వారి కుటుంబ వారసత్వం కూడా దేశాన్ని పాలించడంలో నేడు ఎన్నో విభిన్న అభిప్రాయాలు మనదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వున్నప్పటికీ ప్రజాస్వామ్య లౌకిక భారతంలో భవిష్యత్తు తరాలకు గుణాత్మక విద్య, ఉన్నత స్థాయి వైద్యం, బ్రతుకడానికి భద్రత అందించాల్సిన బాధ్యత నేటితరపు రాజకీయ నాయకులు,పార్టీలపై వుంది. ముఖ్యంగా బాలలు,యువతకు గ్లోబలైజేషన్ ప్రపంచంలో ఆధ్యాత్మిక నైతిక విలువలను వెలికితీసే విద్యను అందిస్తూ మానవత్వపు మంత్రంతో సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా దూసుకెళ్ళేలా చూడాలి. కర్బన ఉద్గారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రకృతి తల్లడిల్లుతున్న ఈ గ్లోబల్ వార్మింగ్ లో అడవులను నరకడం ఆపి, చెట్లను పెంచుతూ కాలుష్య రహిత సమాజంలో నేటిబాలలు కీలకం కావాలి. బస్టాండ్ ల్లో,పరిశ్రమల్లో, హోటళ్లలో, యుద్ధాలలో తదితర ప్రాంతాల్లో "బాల్యం" బంధీగా మారకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా తమ ఆశలు,ఆశయాల పేరిట మరియు పరువు బరువును మోపి సంప్రదాయాల పేరిట పిల్లలను ఒత్తిడికి గురి చేయకుండా జాగ్రత్త వహించాలి. పావన నవజీవన బృందావన నిర్మాతలు-రాబోవు యుగానికి దూతలు అన్న మహాకవి శ్రీశ్రీ మాటలు,ఈ దేశపు భవిష్యత్తు పార్లమెంటులో కాదు పాఠశాలల్లోనే నిర్మించబడుతుందనే దార్శనికతను ప్రదర్శించిన గాంధీజీ, అంబేద్కర్ ఆలోచనలు నిజంకావాలి. నెహ్రూ శాంతిసౌధం నేటి యుద్ధం ప్రపంచానికి పాఠం కావాలి..!

# జర్నలిస్టులకు మిగిలేది మరోసారి మోసమేనా?

■ ఒక సొసైటీకి ఇస్తే 'రాష్ట్ర వ్యాప్తంగా' న్యాయం చేసినట్టా? ■ జర్నలిస్టులంటే హైదరాబాద్ కు చెందిన వారేనా? ■ జిల్లాల జర్నలిస్టులపై ప్రభుత్వాల చిన్నచూపు ■ మొదటి విడత జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు పంపిణీ ■ రెండో విడత మళ్లీ అధికారంలోకి వస్తే ఇస్తాననటం సమంజసమా?

-ఫిరోజ్ ఖాన్
9640466464



'త్వరలో నిర్మించిన ఫోర్త్ సిటీలో అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తాం'.. గత సెప్టెంబర్ నెలలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి పేట్ బషీర్ బాగ్ లో కేటాయించిన 38 ఎకరాలకు సంబంధించిన స్వాధీన పత్రాలను ఇచ్చే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. దీంతో హైదరాబాద్ కు చెందిన వేలాది మంది జర్నలిస్టుల్లో ఆశలు చిగురించాయి. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడం, కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కూడా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో.. తమ దశాబ్దాల కల నెరవేరుతున్నదనుకున్నారు. దీంతో నవంబరులో డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) ఆధ్వర్యంలో ఫోర్త్ సిటీని పరిశీలించి ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూనే.. తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అయితే ఆ మరుసటి రోజే సీఎం నోటి నుంచి వచ్చిన వ్యాఖ్యలు జర్నలిస్టు లోకానికి షాక్ కు గురిచేశాయి. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. 'మొదటి విడత జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. రెండో విడత కూడా ఇస్తాం. అయితే రెండో సారి అధికారంలోకి వచ్చాక ఇస్తాం. జర్నలిస్టులకు కూడా సోషల్ రెస్పాన్సిబిలిటీ ఉండాలి కదా' అని చెప్పారు. మంత్రుల చుట్టూ తిరిగి టైం వేస్ట్ చేసుకోవద్దని చెప్పారు. దీంతో తమకు కూడా త్వరలో ఇండ్లస్థలాలు వస్తాయని భావించిన హైదరాబాద్ తోపాటు రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. అంతేకాకుండా కాంగ్రెస్ వైఖరి కూడా జర్నలిస్టులకు స్పష్టంగా అర్థమైంది. హైదరాబాద్ తోపాటు జిల్లా, మండలాల్లో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ఒక పాలసీ తీసుకువస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన హామీ నీటిమూటగానే మిగిలిపోయేలా కనిపిస్తున్నది.

**మెనిఫెస్టోలో అనేక హామీలు :** అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ కాంగ్రెస్ విడుదల చేసిన మెనిఫెస్టోలో జర్నలిస్టులకు కీలకమైన హామీ ఇచ్చింది. రూ. 100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పింది. సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నది. అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు జిల్లాల వారీగా ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని స్పష్టంగా చెప్పింది. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం, రిటైర్ అయిన జర్నలిస్టులకు పింఛన్, 'జర్నలిస్ట్ హెల్త్ స్కీం' ద్వారా మెరుగైన వైద్యం అందేలా హెల్త్ కార్డుల జారీ వంటి హామీలు ఇచ్చింది. అయితే మెజార్టీ హామీలను ఇంకా నెరవేర్చలేదు. ఇండ్ల స్థలాల విషయం మళ్లీ కోల్డ్ స్టోరేజ్ కు వెళ్లింది.

**బీఆర్ఎస్ హయాంలోనూ వివక్షే :** ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారు. పలు చోట్ల ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావడంతో ఇక తమ సమస్యలు తీరుతాయనుకున్నారు. ఉద్యమ పార్టీగా ఉన్న టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో మరిన్ని ఆశలు పెంచుకున్నారు. అయితే పదేళ్లుగా ఇండ్ల స్థలాలకు మాత్రం నోచుకోలేదు. అప్పటి ప్రభుత్వం జిల్లాల వారీగా జర్నలిస్టుల పట్ల వివక్ష చూపింది. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఖమ్మంలో జర్నలిస్టుల కోసం 23 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ కేబినెట్ తీర్మానించింది. మహబూబ్ నగర్ లో 155 మంది జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేశారు. ఆందోల్ లోనూ ఇండ్ల పట్టాలను అందజేశారు. మరో నాలుగైదు మండలాలు, నియోజకవర్గ కేంద్రాల్లో ఇండ్ల స్థలాలను అందజేశారు. అయితే ఒక పాలసీ అంటూ లేకుండా బలమున్న లీడర్ ఉన్న నియోజకవర్గాల్లో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు దక్కగా, హైదరాబాద్ తోపాటు 95 శాతానికి పైగా నియోజకవర్గాల్లో జర్నలిస్టులకు మొండిచేయే లభించింది.

**సంప్రదింపుల్లోనే మీడియా అకాడమీ పరేషాన్ :** 2022 ఆగస్టులో సుప్రీం కోర్టు తీర్పు తర్వాత.. జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య రిష్కార బాధ్యతలను అప్పటి ప్రభుత్వం మీడియా అకా డమీకి అప్పగించింది. అప్పుడు చైర్మన్ గా ఉన్న అల్లం నారాయణ జర్న లిస్టు సంఘాలు, మీడియా సంస్థలతో సంప్రదింపుల ప్రక్రియ మొదలు పెట్టారు. అభిప్రాయాలను సేకరించారు. అయితే ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శ్రీనివాస్ రెడ్డి మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇండ్ల స్థలాల విషయంలో ఆయన కూడా జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టుల తో ప్రత్యేక మీటింగులు నిర్వహించి ఒపీనియన్స్ తీసుకున్నారు. ఆ తర్వాత జవహర్ సొసైటీ ఇంటి స్థలాల సమస్య మాత్రమే పరిష్కార మైంది. కానీ దశాబ్దాలుగా హైదరాబాద్ తోపాటు జిల్లాలు, నియోజ కవర్గ కేంద్రాలు, మండలాల్లో పని చేస్తున్న జర్నలిస్టుల ఇంటి స్థలాల విషయంలో ఒక క్లారిటీకి రాలేకపోయారు. ప్రభుత్వాన్నీ ఒప్పించలేక పోయారు.

**డెస్క్ జర్నలిస్టుల్లో సరికొత్త ఆందోళన :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక డెస్క్ జర్నలిస్టుల్లో సరికొత్త ఆందోళన మొదలైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డెస్కుల్లో పని చేసే జర్నలిస్టులను వర్కింగ్ జర్నలిస్టులుగా గుర్తించలేదు. ప్రభుత్వాల తరపున ఎలాంటి గుర్తింపును ఇవ్వలేదు. అయితే ఉద్యమ సమయంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చేలా నిబంధనలు రూపొందించి ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు డెస్క్ జర్నలిస్టులు అక్రిడిటేషన్లను పొందగలుగుతున్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండు సార్లు అక్రిడిటేషన్ల గడువును పొడిగించింది. కార్డుల జారీకి కొత్త నిబంధనలు రూపొందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు మీడియా అకాడమీ పలుమార్లు సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలను సేకరిస్తున్నది. అయితే ఈ సారి డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వరని జర్నలిస్టు వర్గాల్లో ప్రచారం జరుగుతుండడం వారిని ఆందోళనకు గురిచేస్తున్నది. ఎవరు ఇలాంటి ప్రతిపాదనలు పెట్టినా.. మీడియా అకాడమీ దీనికి ఒప్పుకోవద్దని డెస్క్ జర్నలిస్టులు కోరుతున్నారు.

**పోరాటాలే మార్గం.. :** 'జీ హుజూర్' సంస్కృతిని వీడి పోరాట పంథాను ఎంచుకుంటే తప్పా.. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే మార్గం కనిపించడం లేదు. సంఘాలు, సొసైటీలుగా విడిపోయి వినతులు, ప్రకటనలు ఇవ్వడం కంటే.. జేఏసీగా ఏర్పడి ముందుకు సాగితే కాస్త ఫలితం వచ్చే అవకాశమున్నది. ఈ టర్మ్ లోనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఇప్పటికే టీడబ్ల్యూజేఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సొసైటీలతోపాటు సొసైటీల్లో సభ్యత్వం లేని వారికీ ఇవ్వాలని కోరింది. చిన్నా, పెద్దా, ప్రభుత్వ, ప్రతిపక్ష అనుకూల సంఘాలు అంటూ ఒకరికొకరు కొట్లాడకుండా.. ఒక్కటై ఈ టర్మ్ లోనే 'పాలసీ' ఏర్పాటుకు మీడియా అకాడమీతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరమున్నది. అప్పుడే దశాబ్దాల జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కల నెరవేరే అవకాశమున్నది.

# పొలిటికల్ బజ్ లేని తెలుగు రాష్ట్రాలు


■ దేశంలో పొలిటిక్స్ ఒక ఎత్తు తెలుగు నాట మరో ఎత్తు ■ రెండు రాష్ట్రాలలో రాజకీయం అంటే చాలా హాట్ హాట్ ■ తెలుగు నాట బలమైన ముద్రను వేసుకున్న నేతలెందరో ■ ఇందిరనే ఎదిరించిన ఎన్టీఆర్ అంటేనే రాజకీయ బాహుబలి ■ రాజకీయ అపర చాణక్యుడుగా చంద్ర బాబుకు పేరుప్రఖ్యాతులు

బివి రమణ
శ్రీకాకుళం

రెండు తెలుగు రాష్ట్రాలలో రాజకీయం అంటే చాలా హాట్ హాట్ గా సాగుతుంది. దేశంలో పొలిటిక్స్ ఒక ఎత్తు తెలుగు నాట మరో ఎత్తు అన్నట్లుగా ఉంటుంది. పొలిటికల్ టేస్ట్ ఈ ప్రాంతాలలో ఎక్కువ. కేవ లం ఎన్నికల సమయంలోనే కాదు దైనందిన జీవితంలోనూ రాజకీయం పరిశీలించడం జనాలు కూడా అలవాటు చేసుకున్నారు. దానికి తగినట్లుగానే తెలుగు రాజకీయం వాడి వేడిగా సాగుతూ ఉంటుంది.

ఇక తెలుగు రాష్ట్రాలు అంటేనే పొలిటికల్ గా యాక్టివ్ గా స్ట్రాటజిక్ గా ఉండేవని పేరు కూడా తెచ్చుకున్నాయి. పొలిటికల్ గా ఒక్ బ్రాండ్ నేమ్ తో ఎంతో మంది జాతీయ స్థాయిలో సత్తా చాటుకున్నారు. ఒక ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్ ఇలా తెలుగు నాట బలమైన ముద్రను వేసుకున్న వారు ఉన్నారు. వీరు పరిపాలించిన రాష్ట్రాలుగా కూడా పేరు ఉందిఇక ఎన్టీఆర్ అంటేనే రాజకీయ బాహుబలిగా చెప్పాలి. ఆయన అప్పట్లో శ్రీమతి ఇందిరాగాంధీనే ఎదిరించిన నేతగా ఉన్నారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ని తుడిచిపెట్టిన మహా నాయకుడిగా కూడా తిరుగులేని ఇమేజ్ ని సాధించారు. ఇక వైఎస్సార్ అంటేనే సంక్షేమాన్ని కొత్త పథకాలతో నిర్వచించిన వారు. ఆయన ఉమ్మడి ఏపీలో అత్యంత బలమైన నాయకుడిగా కాంగ్రెస్ లో నిలిచారు. ఉమ్మడి ఏపీతో పాటు దేశంలో రెండు సార్లు కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వైఎస్సార్ చేసిన కృషిని కూడా అంతా గుర్తు చేసుకుంటారు

చంద్రబాబుకు విజనరీగా దేశమంతా గుర్తింపు ఉంది. ఆయన ఓడిపోయినా కూడా గెలుపు కోసం నిరంతం పనిచేస్తూ మళ్లీ తిరుగులేని ఘనవిజయాలను అందుకునే సీనియర్ మోస్ట్ లీడర్. బాబుని అపర చాణక్యుడుగా కూడా చెబుతారు. ఆయన మార్క్ అన్నది తెలుగు రాజకీయాల్లో ఎపుడూ గట్టిగా ఉంటుంది. హైదరాబాద్ లో ఐటీని చాలా ముందుకు తీసుకుని వచ్చిన దార్శనీకుడు. ఈ రోజు హైదరాబాద్ ఐటీకి హబ్ గా ఉంది అంటే దానికి మూల కారకుడు బాబు అని అంతా ఒప్పుకునే పరిస్థితి ఉంది. కేసీఆర్ విషయానికి వస్తే అసాధ్యం అనుకున్న తెలంగాణా రాష్ట్రాన్ని సుసాధ్యం చేసిన వారుగా చరిత్రలో




కీలకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణా ఉద్యమాన్ని నడిపించిన వారుగా కనిపిస్తారు. ఇలాంటి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇపుడు పొలిటికల్ గా ఎలాంటి బజ్ లేకుండా పోతోంది. దాంతో అంతా చప్పచప్పగా ఉంది. పేపర్ మీడియాలో కానీ టీవీ మాధ్యమాలలో కానీ అలాగే వెబ్ మీడియా యూ ట్యూబ్ చానల్స్ లో కానీ సరైన పొలిటికల్ కంటెంట్ లేకుడా పోయింది. అంతా సాదాసీదాగానే రాజకీయం సాగుతోంది. ఇక సాధారణంగా చూస్తే ఒక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలలో అన్ని మీడియా చానల్స్ కి రెవిన్యూ వైజ్ గా కొంచెం బాగా వస్తుంది. ఎందుకు అంటే యాడ్స్ పరంగా బిజినెస్ బాగా జరుగుతుంది కానీ పొలిటికల్ గా బజ్ లేక సరైన కంటెంట్ లేక అనుకున్నదేదీ రీచ్ కావడం లేదని అంటున్నారు. వీటన్నింటికీ ప్రజలే కారణం అని అంటున్నారు. ఒక పార్టీకి కానీ నాయకుడికి కానీ ల్యాండ్ స్లైడ్ విక్టరీ ఇస్తే కంటెంట్ అన్నది పొలిటికల్ గా అసలు ఉండదని విశ్లేషిస్తున్నారు. ఎందుకంటే ఓడిపోయిన నాయకుడు కనీసం అసెంబ్లీకి కూడా రాలేని పరిస్థితి ఉంటుంది. ఏపీలో చూస్తే జగన్ కి ప్రజలు 151 సీట్లతో 2019లో ల్యాండ్ స్లైడ్ విక్టరీని ఇచ్చారు. ఆ రోజులల్లో చంద్రబాబు కూడా అవమానం ఫీల్ అయి అసెంబ్లీకి రెండున్నరేళ్ల పాటు రాలేదు అని అంటున్నారు. ఇపుడు జగన్ కూడా ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని మారాం చేస్తున్నారు అని గుర్తు చేస్తున్నారు. అందుకే అసెంబ్లీ జరుగుతున్నా ఎవరూ ఆ వైపుగా చూడడం లేదు అని అంటున్నారు. దాంతో మీడియా రీచ్ లేదని అంటున్నారు. ఒకపుడు ఉమ్మడి ఏపీలో చంద్రబాబు వైఎస్సార్ అటూ ఇటూ అసెంబ్లీలో ఉంటే టీవీలకే జనాలు అతుక్కునిపోయేవారు అని గుర్తు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరిగినన్నాళ్ళూ రాజకీయ తిరునాళ్ళు గా ఉండేదని కూడా చెబుతారు తెలంగాణా అసెంబ్లీలో చూస్తే కేసీఆర్ సభకు రావడాం లేదు. రేవంత్ రెడ్డి దెబ్బకు ఆయన మార్క్ వ్యూహాలకు ఏ మాత్రం కేటీఆర్ సరిపోవడంలేదు అని అంటున్నారు. ఇక హరీష్ కి అంత పొలిటికల్ గా బజ్ లేదని విశ్లేషిస్తున్నారు. ఇక తెలంగాణాలో బీజేపీకి పెద్ద నాయకులు లేరు. దాంతో అక్కడ కూడా చప్పగానే అసెంబ్లీ సాగుతోంది. ఏపీలో చూసినా ఇదే తీరు. సభలో అంతా వారే ఉన్నారు. మొత్తం నాలుగు పార్టీలు అసెంబ్లీలో కనిపిస్తున్నా మూడు పార్టీలు అధికార కూటమిలో ఉన్నాయి. దాంతో అంతా అధికార పక్షమే. అందరూ ట్రెజరీ బెంచీల వైపే ఉన్నారు స్పీకర్ కి రెండో వైపు చూసే అవకాశం వైసీపీ ఇవ్వకుండా సభకు రాకుండా పోతోంది. దాంతో ఒంటి చేతులల్తో చప్పట్లు గానే అంతా సాగుతోంది. ప్రజాస్వామ్యంలో అధికార విపక్షాలు రెండు చక్రాలుగా ఉండాలి. అధికార పార్టీని విపక్షం నిగ్గదీయాలి. జవాబులు రాబట్టాలి. అలాగే అధికార పార్టీ కూడా తనదైన శైలిలో ప్రజలకు ఏమైనా చెప్పాలీ అంటే సరైన విపక్షం ఉన్నపుడే అది సాధ్యపడుతుంది. ఇపుడు తెలుగు నాట రెండు సభల్లో విపక్షం నుంచి అయితే పెద్దగా పొలిటికల్ బజ్ లేకపోవడంతో అసెంబ్లీ సమావేశాలు కూడా చప్పగా సాగిపోతున్నాయని అంటున్నారు. ఇది మంచి పరిణామం కాదనే అంటున్నారు. అధికారంలో వచ్చేందుకు అవసరమైన సీట్లను ఇచ్చి బలమైన విపక్షాన్ని కూడా సభకు పంపిస్తేనే ప్రజా సమస్యలు గట్టిగా ప్రస్తావనకు వస్తాయని అంటున్నారు. మరి తెలుగు నాట ఓటర్లు చాలా తెలివైన వారు. రానున్న రోజులలో వారు ఏ రకమైన తీర్పులు ఇస్తారో చూడాల్సి ఉంది.

# అర్ష్‌దల్లాను అప్పగించండి

లిమా : భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించిన ఖలిస్థానీ వేర్పాటువాది అర్షదీప్ సింగ్ అలియాస్ అర్ష్ దల్లా ను కెనడా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడిని తమకు అప్పగించాలని ఇటీవల కెనడా ను భారత్ కోరింది. ఈ విషయంపై కెనడా విదేశాంగ శాఖ మంత్రి మెలానీ జోలీ స్పందిస్తూ అతడిని అప్పగించే విషయంపై భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌తో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం పెరూలోని లిమాలో జరిగిన ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార వార్షిక మంత్రివర్గ సమావేశంలో మెలానీ జోలీ మాట్లాడుతూ ప్రస్తుతం అర్ష్ దల్లా కేసులో విచారణ జరుగుతోందని..కాబట్టి ఆ విషయంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదని అన్నారు. అతడికి సంబంధించి ఏవైనా విచారణలు చేయాల్సి ఉంటే భారత దౌత్యవేత్తలతో చర్చలు జరుపుతామని తెలిపారు. అక్టోబరు 27, 28న మిల్టన్ పట్టణంలో కాల్పులు జరిపిన ఘటనలో సింగ్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన కెనడా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, పోలీసులు అతడిని అరెస్టు చేశారు. పంజాబ్‌లోని మోగా జిల్లాకు చెందిన దల్లాపై భారత్‌లో హత్య, వేధింపులు, అపహరణ సహా పలు కేసులు ఉన్నాయి. గతేడాది జనవరిలో భారత ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. పెద్ద మొత్తంలో డ్రగ్స్, ఆయుధాల స్మగ్లింగ్‌లో ఇతడి పాత్ర ఉందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ కూడా తెలిపింది. దల్లాకు సంబంధించిన పలుకేసులను జాతీయ విచారణ సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఖలిస్థానీ ఉగ్రవాది, గుర్తు తెలియని వారి కాల్పుల్లో హతమైన నిజ్జర్‌కు దల్లా సన్నిహితుడు



# ఉగ్రవాదులు మనల్ని భయపెట్టలేరు

● వారు తమ సొంత గడ్డ పై భయంభయంగా బతుకుతున్నారు ● 26/11 ముంబయి పేలుళ్ల కథనాలతో భయపెట్టాలనుకున్నారు ● ఈ దేశ ప్రజలు మమ్మల్ని నమ్మి మూడోసారి అవకాశమిచ్చారు
● హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో ప్రధాని కీలక ప్రసంగం

న్యూఢిల్లీ : గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే పాలసీలు తీసుకొచ్చాయని ప్రధాని మోదీ విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాకే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించామని పేర్కొన్నారు. శనివారం జరిగిన హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో ప్రధాని కీలక ప్రసంగం చేశారు. ఈసందర్భంగా ఉగ్రవాదం, తదితర అంశాలను ప్రస్తావించారు. సదస్సు ప్రాంగణంలో ప్రదర్శించిన 26/11 ముంబయి పేలుళ్ల కథనాలను మోదీ వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. "ఆ సమయంలో భారత ప్రజలు సురక్షితంగా లేరని చెప్పేందుకు కొందరు ఉగ్రవాదాన్ని ఉపయోగించేవారు. కానీ కాలం మారింది. ఇప్పుడు ఉగ్రవాదులు వారి సొంతగడ్డపైనే అభద్రతాభావంతో ఉంటున్నారు. భయంభయంగా బతుకుతున్నారు. ఇక, వారు మనల్ని భయపెట్టలేరు" అని మోదీ అన్నారు. ఈసందర్భంగా విపక్షాల పై మోదీ విమర్శల వర్షం కురిపించారు. "ఇప్పుడు ప్రపంచంలోని చాలా దేశాల్లో ఎన్నికల తర్వాత ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ, ఈ దేశ ప్రజలు మమ్మల్ని నమ్మి మూడోసారి అవకాశమిచ్చారు. గత ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పాలసీలను తీసుకొచ్చాయి. ఆ పరిస్థితిని మేం పోగొట్టాం. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాం. మా విధానాలతో ప్రజలను ఆశావహ దృక్పథం వైపు నడిపిస్తున్నాం. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే అనే మంత్రంతో మా ప్రభుత్వం ముందుకుసాగుతోంది. ప్రజల కోసం ఎక్కువగా ఖర్చు చేయాలి. ప్రజల కోసం ఎక్కువగా పొదుపు చేయాలనేదే మా విధానం" అని మోదీ వివరించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు.. అనంతరం మోదీ తమ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, ఓటు బ్యాంకు రాజకీయాలకు దూరంగా ఉందని అన్నారు. 'ప్రజల కోసం, ప్రజలచే అభివృద్ధి' అనేది తమ ప్రభుత్వ స్పష్టమైన లక్ష్యమన్నారు. తాము ప్రజా ప్రయోజనాల దిశలో మాత్రమే పయనిస్తున్నామన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రధాని మోదీ అన్నారు. భారతదేశాన్ని సుసంపన్నమైన, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం, భారతీయులు తమ నమ్మకాన్ని అందించారని, ఆ నమ్మకాన్ని పూర్తి చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని ఆయన అన్నారు. సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారం, పుకార్లను కూడా ఆయన ప్రస్తావించారు.




**యువతలో రిస్క్ తీసుకునే స్ఫూర్తి..** స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో యువతలో రిస్క్ తీసుకునే స్ఫూర్తి కొరవడిందని, అయితే గత 10 ఏళ్లలో ఇది పూర్తిగా మారిపోయిందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం భారతదేశంలో 1.25 లక్షలకు పైగా నమోదైన స్టార్టప్‌లు ఉన్నాయని, మన యువత దేశం గర్వించేలా చేయాలని ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన పారిశుధ్యం, ఉపాధి కల్పన పథకాలను కూడా ప్రధాని ప్రస్తావించారు. "మన దేశంలో మరుగుదొడ్లు నిర్మించాలనే ప్రచారం ప్రారంభించబడింది. ఈ పథకం పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంలో మాత్రమే కాకుండా ఉపాధిని సృష్టించడం, ఆర్థిక వ్యవస్థను పెంపొందించడంలో సహాయపడింది. ఈ పథకం గౌరవం, భద్రతను అందిస్తుంది." అని తెలిపారు.

# మూడు దేశాల్లో ప్రధాని మోడీ.. పర్యటన

● నైజీరియా, బ్రెజిల్, గయానా దేశాల్లో పర్యటన..
● జీ-20 సమ్మిట్ లోనూ పాల్గొననున్న మోడీ..



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోడీ బ్రెజిల్‌లో జరిగే జీ-20 సమ్మిట్ కోసం బయలుదేరారు. బ్రెజిల్ సహా గయానా, నైజీరియా దేశాల్లో పర్యటించనున్నారు. గతేడాది జీ-20 సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. 17 ఏళ్ల తర్వాత భారత ప్రధాని నైజీరియాలోలో పర్యటించబోతున్నారు. 5 దశాబ్ధాల తర్వాత ఒక భారత ప్రధాని గయానకు వెళ్లడం ఇదే మొదటిసారి. ప్రధాని తన 5 రోజుల పర్యటనలో మొదటి రెండు రోజులు(నవంబర్ 16-17) నైజీరియాలో గడపనున్నారు. "నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు, పశ్చిమ ఆఫ్రికా ప్రాంతంలో మా సన్నిహిత భాగస్వామి అయిన నైజీరియాకు ఇది నా మొదటి పర్యటన. మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి నా పర్యటన ఒక అవకాశంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యం, భాగస్వామ్య విశ్వాసం గురించి నేను భారతీయ సమాజాన్ని, నైజీరియాలోని స్నేహితులను కలవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను." అంటూ ప్రధాని ట్వీట్ చేశారు. నవంబర్ 18-19 తేదీల్లో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా ఆతిథ్యం ఇవ్వనున్న జీ-20 సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని తదుపరి బ్రెజిల్‌లోని రియో డి జెనీరోకు వెళతారు. ఆ తర్వాత ప్రధాని గయనాలో పర్యటించనున్నారు. 1968 తర్వాత ఒక భారత ప్రధాని ఈ దేశానికి వెళ్లడం ఇదే తొలిసారి. అక్కడ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు గయానా పార్లమెంట్‌లో ప్రసంగిస్తారు. తన పర్యటనలో మోడీ 2వ ఇండియా-కారికోమ్ సమ్మిట్‌లో కరేబియన్ దేశాల నాయకులతో చర్చించనున్నారు.



# బంగ్లాదేశ్‌పై ఆర్థిక ఆంక్షలు విధించాలి

● ట్రంప్‌ని కోరనున్న భారత అమెరికన్లు..
● హిందువులపై హింసకు వ్యతిరేకంగా యూఎస్ చర్యలు తీసుకోవాలని డిమాండ్..

వాషింగ్టన్ : హిందువులతో పాటు మైనారిటీలపై దాడులకు పాల్పడుతున్న బంగ్లాదేశ్ ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని భారతీయ అమెరికన్లు కోరుతున్నారు. ఈ మేరకు బంగ్లాదేశ్‌పై ఆర్థిక ఆంక్షలు విధించడంతో పాటు చర్యలు తీసుకోవాలని వచ్చే ఏడాది ఏర్పాటు కాబోతున్న ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌ని, యూఎస్ కాంగ్రెస్‌ని సంప్రదించడానికి భారతీయ అమెరికన్లు కృషి చేస్తున్నారు. బంగ్లాదేశ్‌పై ఇటీవల డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశంలో హిందువులపై జరిగిన దాడుల్ని ఖండించారు. దీపావళి సందర్భంగా అక్కడ భారతీయ కమ్యూనిటీ సమావేశానికి హాజరైన ట్రంప్ బంగ్లాదేశ్ తీరును ఎండగట్టారు. హిందువులపై జరుగుతున్న హింసకు సంబంధించి బంగ్లాదేశ్‌కి వ్యతిరేకంగా ట్రంప్ వ్యవహరిస్తారనే భారతీయ అమెరికన్ డాక్టర్ భరత్ బరాయ్ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. హిందువులపై దాడులు విషయంలో పరిస్థితి మెరుగుపడకుంటే ఆర్థిక ఆంక్షలను పరిశీలించే ధైర్యమున్న వ్యక్తి ట్రంప్ అని ఆయన అన్నారు. " వారి వ్యాపారంలో 80 శాతం వాటా కలిగిన వస్త్ర ఎగుమతులు నిలిచిపోతే, బంగ్లాదేశ్ ప్రజలు ఏం తింటారు..? మహ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం కేవలం సైన్యంచే నియంత్రించబడుతోంది. అతను కేవలం కీలు బొమ్మ. దేశాన్ని నియంత్రించేది సైన్యమే" అని బరాయ్ అన్నారు. అంతకుముందు దీపావళి వేడుకలకు హాజరైన ట్రంప్ మాట్లాడుతూ..కమలా, జోబైడెన్‌లు ఇద్దరూ ప్రపంచ వ్యాప్తంగా, అమెరికాలోని హిందువులను విస్మరించారని, వారు ఇజ్రాయిల్ నుంచి ఉక్రెయిన్ వరకు ఇబ్బందులు కలిగించారని, మేము అమెరికాను బలపరుస్తామని, శాంతిని తిరిగి తీసుకువస్తామని చెప్పారు. "బంగ్లాదేశ్‌లో మొత్తం గందరగోళ స్థితిలో ఉన్న హిందువులు, క్రైస్తవులు మరియు ఇతర మైనారిటీలపై దాడి మరియు దోపిడీకి గురౌతున్న అనాగరిక హింసను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ట్రంప్ అన్నారు. రాడికల్ లెఫ్ట్, మత వ్యతిరేక ఎజెండా నుంచి మేము హిందూ అమెరికన్లను రక్షిస్తామని, మీ స్వేచ్ఛ కోసం పోరాడుతామని ట్రంప్ చెప్పారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టులు మృతి, ఇద్దరు జవాన్లకు గాయాలు



నారాయణపూర్‌: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. యాంటీ నక్సలైట్ ఆపరేషన్‌లో భాగంగా గాలింపు చేపడుతున్న భద్రతా బలగాలకు శనివారం ఉదయం 8 గంటలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. వెంటనే వారు జవాన్లపై కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు కూడా మావోయిస్టులపై ఎదురు కాల్పులు జరిపాయి. ఈ ఎదురు కాల్పుల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మరోవైపు, ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఈ ఘటన నారాయణపూర్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో చోట చేసుకుంది. ఘటనాస్థలి నుంచి మవోయిస్టుల మృతదేహాలు, భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన సైనికులను రాయ్‌పుర్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. జవాన్లకు మెరుగైన చికిత్స అందించడం కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు బస్తర్ రేంజ్ ఐజీ పీ సుందర్రాజ్వెల్లడించారు. కాగా, బార్డర్‌సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్), డిస్ట్రిక్ట్రిజర్వ్ గార్డ్(డీఆర్జీ), స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్) సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌ఇంకా కొనసాగుతోంది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయి. అబూజ్మడ్.. గోవా రాష్ట్రం కంటే విస్తారమైన అన్-సర్వేడ్ భూమి. ఇది ఎక్కువగా నారాయణపూర్ జిల్లాలో ఉంది. దాని చిన్న భాగాలు బీజాపూర్, దంతేవాడ, కంకేర్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలో విస్తరించి ఉన్నాయి . గతేడాది వరకు దట్టమైన ఈ అటవీప్రాంతం, ప్రభుత్వాధికారులు లేకపోవటం వల్ల ఈ ప్రాంతం మావోయిస్టులకు స్వర్గధామంగా ఉండేది. అయితే, ఈ సంవత్సరం, ప్రభుత్వం చేపట్టిన 'మాద్ బచావో' (సేవ్ మాద్) ప్రచారంలో భాగంగా, అబుజ్మద్, దాని పరిసర ప్రాంతాల్లో భద్రతా దళాలు జరిపిన ఎన్‌కౌంటర్లలో 100 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. కాగా, శనివారం నాటి ఎన్‌కౌంటర్‌తో.. బస్తర్ ప్రాంతంలో మరణించిన మొత్తం మావోయిస్టుల సంఖ్య ఈ సంవత్సరం 197కి పెరిగింది. 2000లో ఛత్తీస్‌గఢ్ ఏర్పడినప్పటి నుంచి ఒక సంవత్సరంలో ఇదే అత్యధికం. ఈ ఏడాది ఇక్కడ మావోయిస్టుల చేతిలో 17 మంది భద్రతా సిబ్బంది మరణించగా, 60 మంది పౌరులు మరణించారు.

## శిరోమణి అకాలీదళ్ అధ్యక్ష పదవికి
# సుఖ్‌బీర్ సింగ్ బాదల్ రాజీనామా



అమృద్‌సర్‌: శిరోమణి అకాలీదళ్ అధ్యక్ష పదవికి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ (62) శనివారం రాజీనామా చేశారు. ఈ విషయాన్ని పంజాబ్ మాజీ విద్యాశాఖ మంత్రి దల్జిత్ ఎస్ చీమా ట్వీట్ చేశారు. కొత్త అధ్యక్షుడి ఎన్నికకు మార్గం సుగమం చేసేందుకు ఎస్ఎడి అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఈరోజు పార్టీ వర్కింగ్ కమిటీకి తన రాజీనామాను సమర్పించినట్లు చీమా ట్వీట్ చేశారు. ఇటీవల సిక్కు మత పెద్దలు సుఖ్‌బీర్‌ను టంకయ్యగా డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఆయనకు శిక్ష పడాల్సి ఉంది. సిక్కు మత సూత్రాలను ఉల్లంఘించిన వారిని టంకయ్యగా పేర్కొంటారు. ఆ కేసులో దోషిగా తేలిస్తే, ఆ మత ఆచారం ప్రకారం శిక్ష వేస్తారు. తన నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేసినందుకు.. పదవీకాలం మొత్తం హృదయపూర్వక మద్దతు, సహకారాన్ని అందించినందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ సుఖ్‌బీర్ సింగ్ బాదల్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. తదుపరి కార్యాచరణపై చండీగఢ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు అకాలీదళ్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ భుందార్ వర్కింగ్ కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇదిలా ఉంటే.. అకాలీదళ్ అధ్యక్ష, ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సమావేశానికి డిసెంబర్ 14న ఎన్నికలు జరగనున్నాయి.

# ఇరాన్ అణు పరిశోధన కేంద్రం ధ్వంసం

● ఐడీఎఫ్ ధ్వంసం చేసినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు



వాషింగ్టన్‌: ఇరాన్ అణు పరిశోధనా కేంద్రానికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లే తెలుస్తోంది. అక్టోబర్ చివరిలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడితో పెద్ద ఎత్తునే ముప్పు వాటిల్లినట్లుగా తాజాగా కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్‌లోని పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్‌లోని క్రియాశీలకమైన అణ్వాయుధ పరిశోధన కేంద్రాన్ని ఇజ్రాయెల్ దళాలు ధ్వంసం చేసినట్లుగా ముగ్గురు యూఎస్ అధికారులు, ఇజ్రాయెల మాజీ అధికారి ఉటంకిస్తూ తాజాగా అంతర్జాతీయ మీడియాలో కథనాలు పేర్కొన్నాయి. హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లాను ఇజ్రాయెల్ హతం చేసిన తర్వాత ఇరాన్ ప్రతీకారంగా అక్టోబర్ ప్రారంభంలో 180 క్షిపణులను ఇజ్రాయెల్‌పై ప్రయోగించింది. అయితే గగనతలంలోనే ఈ రాకెట్లను ఐడీఎఫ్ ధ్వంసం చేసింది. కొన్ని మాత్రం టెల్ అవీవ్ ప్రాంతంలో పడినట్లు వార్తలు వినిపించాయి. అయితే ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదని ఐడీఎఫ్ తెలిపింది. అయితే ఇరాన్ చర్యపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ తప్పు చేసిందని.. ప్రతీకార చర్యలుంటాయని వార్నింగ్ ఇచ్చారు. అన్నట్టుగానే అక్టోబర్ చివరిలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. ఇరాన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. అయితే ఇరాన్ మాత్రం ఎలాంటి నష్టం జరగలేదని తెలిపింది. తాజా నివేదికలను బట్టి అణ్వాయుధ పరిశోధన కేంద్రం ధ్వంసం అయినట్లుగా తెలుస్తోంది. ఈ పరిణామం ఇరాన్‌కు పెద్ద ఎదురుదెబ్బే అని చెప్పొచ్చు. అక్టోబర్ 7, 2023న హమాస్.. ఇజ్రాయెల్‌పై దాడి పౌరులను బందీలుగా తీసుకుపోయింది. ఆరోజు నుంచి ఇజ్రాయెల్ పగతో రగిలిపోయింది. హమాస్ అంతమే లక్ష్యంగా గాజాపై విరుచుకుపడింది. గాజా పట్టణాన్ని ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. అంతేకాకుండా హమాస్ అగ్ర నేతలందరినీ హతం చేసింది. ఇక హమాస్‌కు మద్దతుగా కాలుదువ్విన హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థపై కూడా ఐడీఎఫ్ దళాలు దాడుల చేశాయి. హిజ్బుల్లా అగ్ర నేతలను హతం చేసింది. ప్రస్తుతం హమాస్, హిజ్బుల్లా అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది.

# మస్క్-రష్యా సంబంధాలపై దర్యాప్తు

డిమాండ్‌తో డెమోక్రటిక్ సెనెటర్ల లేఖ



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయం కోసం స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తీవ్రంగా కృషి చేశారు. దీంతో ఆయనకు ట్రంప్ కీలక బాధ్యతలు అప్పగించారు. మస్క్‌తోపాటు భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిల ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) సంయుక్త సారథులుగా నియమించారు. మరోవైపు మస్క్‌పై డెమోక్రటిక్ నేతలు గుర్రుగా ఉన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ తో ఆయన బంధంపై సమీక్ష చేపట్టాలని ఇద్దరు డెమోక్రటిక్ సెనెటర్లు బైడెన్ అడ్మినిస్ట్రేషన్‌ను డిమాండ్ చేశారు. రష్యన్ అధికారులను మస్క్ గత రెండేళ్లుగా కలుస్తున్నారన్న నివేదికలను ఉటంకిస్తూ.. వీటిపై సమీక్ష చేపట్టాలని సెనెటర్లు జీన్ షాహీన్, జాక్ రీడ్ జస్టిస్ డిపార్ట్‌మెంట్, పెంటగాన్ సంస్థలకు లేఖ రాశారు. ఈ ఇద్దరు సెనెటర్లు ఆర్మ్‌డ్ సర్వీసెస్ కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు. ఈ సంబంధాలు జాతీయ భద్రతకు ముప్పు అని వారు పేర్కొన్నారు. స్పేస్ ఎక్స్‌కు, ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందాలపై దర్యాప్తు చేపట్టాలని కోరారు. బిలియన్ డాలర్ల మేర మస్క్ లబ్ధి పొందారని.. ఈ వ్యవహారం ఆయన విశ్వసనీయతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోందని వారు లేఖలో పేర్కొన్నారు. రష్యా ప్రభుత్వ అధికారులకు, సెక్యూరిటీ క్లియరెన్స్ ఉన్న ఏ వ్యక్తికి మధ్య సంబంధాలైనా అమెరికా భద్రతను ప్రమాదంలో పడేసే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. మాస్కోతో మస్క్ సంబంధాలపై గత నెల వాల్ స్ట్రీట్ జర్నల్ కథనాలు ప్రచురించిన అనంతరం చాలామంది డెమోక్రటిక్ నేతలు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని బహిరంగంగా కోరుతున్నారు. అయితే.. దీనిపై దర్యాప్తు చేపట్టాలని అధికారులకు లేఖ రాయడం ఇదే తొలిసారి. ఈ వ్యవహారంపై ఇటు స్పేస్ ఎక్స్ గానీ, అటు పెంటగాన్ గానీ స్పందించలేదు. అయితే.. ఈ ఆరోపణలు ఎవరు చేస్తున్నారో తాను కనిపెడతానని ఎక్స్ వేదికగా మస్క్ స్పందించారు.




# 10 మంది శిశువులు సజీవ దహనం

● యూపీ ఝాన్సీ మెడికల్ కాలేజీలో ఘటన

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఘోరం జరిగింది. ఝాన్సీ మెడికల్ కాలేజీలోని చిన్నారుల వార్డులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 10 మంది సజీవ దహనమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. యూపీలోని మహారాణి లక్ష్మీబాయ్ మెడికల్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి పదిన్నర గంటల నుంచి పదకొండున్నర మధ్యలో చిన్నపిల్లల నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ వార్డులో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. ఘటన జరిగిన సమయంలో ఆ వార్డులో 47 మంది చిన్నారులు ట్రీట్ మెంట్ తీసుకుంటున్నారు. వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగగానే పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు బయటకు పరుగెత్తారు. ఈ సమయంలో స్వల్ప తొక్కిసలాట చోటు చేటు చేసుకుంది. డెలివరీకి వచ్చిన మరికొందరి మహిళలను ఆసుపత్రి నుంచి బయటకు తరలించారు. ఈ క్రమంలో 10 మంది శిశువులు సజీవ దహనమయ్యారు. మరో 16 మందికి గాయాలయ్యాయి. మరో 37 మందిని రక్షించారు. మంటల సమయంలో దట్టమైన పొగలు ఆసుపత్రి లోపల వ్యాపించాయి. ఊపిరాడక కొందరు శిశువులు మృత్యువాత పడ్డారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఫైటర్లు అక్కడికి చేరుకున్నాయి. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగింది. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ అవినాష్‌కుమార్, జిల్లా యంత్రాంగమంతా అక్కడికి చేరుకుంది. సహాయ చర్యలను పర్యవేక్షించింది. ట్రీట్‌మెంట్ కోసం చిన్నారులను మరో ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే సీఎం యోగి ఆదిత్యనాథ్, విచారం వ్యక్తం చేశారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటన పై వెంటనే విచారణ చేపట్టాలన్నారు. సీఎం యోగి ఆదేశాలతో డిప్యూటీ సీఎం, బ్రిజేశ్ పాఠక్, హెల్త్ సెక్రటరీ వెంటనే లక్నో నుంచి ఝాన్సీకి బయలుదేరి వెళ్లారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉంటాయన్నది అధికారుల మాట. విచారణలో ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాలి.

# ట్రంప్ ఎన్నిక..అమెరికాకు మంచిదే

హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్



ఢిల్లీ: అమెరికాకు అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ పాలనలో అమెరికా మరింత అభివృద్ధి చెందుతుందని కేంద్ర విదేశాంగమంత్రి జై శంకర్ పేర్కొన్నారు. ఆయన ఎన్నికతో యూఎస్ ఆర్థిక, తయారీ రంగాల్లో మరిన్ని ప్రయోజాలు పొందుతుందని తెలిపారు. ప్రపంచీకరణ అంశంపై ఓటర్లలో ఉన్న అసంతృప్తి అమెరికా ఎన్నికల్లో కనిపించిందన్నారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సదస్సులో జైశంకర్ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచీకరణ వల్ల చైనా ఇతర దేశాల కంటే అధికంగా లబ్ధి పొందుతుందని ఆయన అన్నారు. క్లింటన్ పరిపాలనలో మొదట దీనిని అవలంభించారని పేర్కొన్నారు. అప్పట్లో దీనివల్ల యూఎస్, భారత్ సహా ఇతర దేశాల్లో అనిశ్చితి నెలకొందని వెల్లడించారు. అమెరికా ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశమయినప్పటికీ.. దానికి ప్రపంచ భాగస్వామ్య దేశాల మద్దతు అవసరమని అభిప్రాయం వ్యక్తంచేశారు. దేశ భద్రత గురించి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికత, జాతీయ భద్రతను విభజించలేమని.. డిజిటల్, ఏఐ విప్లవంలో ఇది భాగమని అన్నారు. భారతదేశ ఆర్థికవ్యవస్థ వైపు ప్రపంచం చూస్తోందని జైశంకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని చాలా దేశాలు రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటున్నాయని.. ఈ సమయంలో భారత్‌లో ఉన్న రాజకీయ సుస్థిరతను అవి గమనిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో మళ్లీ ఎన్నికవడం అంత సులభం కాదని.. అయినా తమ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలు మూడోసారీ ఎన్డీఏకు పట్టం కట్టారని.. ఇది మామూలు విషయం కాదన్నారు. 7-8 శాతం వృద్ధి రేటును కొనసాగించడం ఇతర దేశాలకు సవాలుగా మారిందని జైశంకర్ పేర్కొన్నారు. దీంతో ప్రపంచదేశాలు భారతదేశ ఆర్థికవ్యవస్థ వైపు చూస్తున్నాయని.. భారత్‌లో వ్యాపారాలు చేయడానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయన్నారు.

# రాహుల్ బ్యాగ్‌లు తనిఖీ చేసిన ఈసీ

● మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత



ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ.. ప్రచారంలో పాల్గొనే నేతల బ్యాగులు, హెలికాప్టర్లలో తనిఖీల పరంపర కొనసాగుతోంది. తాజాగా అమరావతిలో ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బ్యాగులను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. శనివారం మధ్యాహ్నం అమరావతిలో ఆయన హెలికాప్టర్ ల్యాండ్ అవ్వగానే అధికారులు చెక్ చేశారు. ఆయన వెంట తెచ్చుకున్న బ్యాగులతో పాటు హెలికాప్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సమయంలో రాహుల్ తన పార్టీ నేతలతో మాట్లాడుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. మహారాష్ట్ర లో ఈ 'ఎన్నికల తనిఖీలు' తాజాగా రాజకీయ దుమారానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఇటీవల మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే బ్యాగులను ఎన్నికల అధికారులు పలుమార్లు తనిఖీ చేయడం చర్చనీయాంశమైంది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకున్నారంటూ ఎన్నికల అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. ఆ తర్వాత పలువురు ప్రతిపక్ష నేతలు కూడా ఇదే విధమైన అసహనాన్ని వ్యక్తం చేశారు. అయితే, ఎన్నికల వేళ ఇది సాధారణ ప్రక్రియే అంటూ ఈసీ స్పష్టతనిచ్చింది. అంతేకాదు.. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్, దేవేంద్ర ఫడణవీస్, కేంద్రమంత్రి అమిత్ షా తదితర ఎన్డీయే నేతల బ్యాగులనూ అధికారులు తనిఖీ చేశారు. తన హెలికాప్టర్‌ను ఈసీ బృందం పరిశీలిస్తున్న దృశ్యాలను స్వయంగా అమిత్ షా తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు.పక్షపాత రహిత, ఆరోగ్యకరమైన ఎన్నికల వ్యవస్థను భాజపా విశ్వసిస్తోందని రాసుకొచ్చారు. కాగా.. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ రాహుల్ గాంధీ హెలికాప్టర్‌ను ఈసీ అధికారులు తనిఖీ చేసిన సంగతి తెలిసిందే. 288 శాసనసభ నియోజకవర్గాలున్న మహారాష్ట్రలో నవంబరు 20న ఒకే విడతలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 23న ఫలితాలను వెల్లడించనున్నారు.

# ఓవైసీ బ్రదర్స్‌పై ఈసీకి ఫిర్యాదు!

● రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు.. చర్యలు తీసుకోమని డిమాండ్



ముంబైః ప్రజల మధ్య కల్లోలం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఆయన సోదరుడు అక్బరుద్దీన్ ఓవైసీలపై చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్, ముంబై పోలీసు కమిషనర్ లకు శివసేన లేఖ రాసింది. ఇటీవల షోలాపూర్ లో జరిగిన ఓ బహిరంగ సభలో వీరు ఇచ్చిన ప్రసంగాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఆరోపించింది. ఈ మేరకు శివసేన సోషల్ మీడియా ఇంఛార్జ్ రహూల్ కనాల్ పోల్ ప్యానెల్ రాసిన లేఖలో ఓవైసీ సోదరులు తమ ప్రసంగాల ద్వారా రాష్ట్రంలోని వివిధ వర్గాల వారి మనోభావాలను దెబ్బతీశారని పేర్కొన్నారు. ఓవైసీ సోదరుల ప్రసంగంలో ప్రజాశాంతికి భంగం కలిగించే ప్రకటనలు ఉన్నాయని తెలిపారు. మతం ప్రాతిపదికన శత్రుత్వం, మతాల మధ్య విభజను సృష్టించడం లాంటివి ఉన్నాయని పేర్కొన్నారు. మత సామరస్యానికి విఘాతం కలిగించడం, సమాజంలో అశాంతి సృష్టించడం లక్ష్యంగా ఓవైసీ సోదరుల ప్రసంగం ఉందని, వారి ప్రసంగంలో నేరపూరిత కంటెంట్ స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. వారి ఉద్వేగభరితమైన ప్రసంగాల వల్ల ప్రజల భద్రతకు తీవ్రమైన ముప్పు ఉందని సంచలన ఆరోపణలు చేశారు. ఓవైసీ సోదరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఓవైసీ బ్రదర్స్ ప్రసంగం వీడియో ఆధారంగా సమగ్ర విచారణ జరిపి దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. చర్యలు తీసుకుంటేనే మరోసారి ఇలాంటివి జరగకుండా ఉంటాయని అధికారులకు తెలిపారు.



# త్వరలోనే కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ

● తాటి చెట్లు ఎత్తు తక్కువ ఉండేలా శాస్త్రీయ పరిశోధనలు ● స్థలం ఉంటే బోర్లు వేసి చెట్లను నాటి కాపాడుకోవాలి ● మంత్రి పొన్నం ప్రభాకర్

తెలంగాణ బ్యూరో\ప్రతినిధి: ప్రతి ఒక్కరూ 10 మొక్కలు ప్రభుత్వ స్థలాల్లో , కాల్వల్లో గట్లపైన తాటి, ఈత వనాలను నాటాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కల్లు గీతా కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...తాటి చెట్టు నుంచి పడి గీతా కార్మికులు చనిపోతున్నారని ఈ కాటమయ్య కిట్, ప్రమాదం నుంచి ప్రాణాలు రక్షించడానికి ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయామని చెప్పారు. స్వయంగా సీఎం రేవంత్ అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఈ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎలా పని చేస్తుందో ముఖ్యమంత్రి వివరించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వంతో పాటు శాసనసభ్యుల నిధులు, పార్లమెంటు సభ్యుల నిధులు కూడా వెచ్చించి కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. వృత్తిలో ఉన్న వారికి రక్షించుకోవడంతో పాటు భవిష్యత్‌లో పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారు ఉన్నత శిఖరాలు పొందేలా కష్టపడాలని సూచించారు.తాటి చెట్టు ఎత్తు తక్కువ ఉండేలా కూడా శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. స్థలం ఉంటే బోర్లు వేసి చెట్లను నాటి కాపాడుకోవాలని అన్నారు. బోర్ వేసే ప్రతిపాదన ఇవ్వండి వెంటనే వేయిస్తామని తెలిపారు.ఎక్స్‌గ్రేషియా పాత బకాయిలు విడుదలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు

# టిడ్కో ఇళ్లలో అక్రమాలపై దర్యాప్తు

● చెల్లింపుల్లో అవకతవలపై మంత్రికి ఎమ్మెల్యేల ఫిర్యాదు ● అసెంబ్లీలో హామీ ఇచ్చిన మంత్రి నారాయణ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః మాజీ ముఖ్యమంత్రి చేసిన పిచ్చి పనులతో టిడ్కో ఇళ్ల లబ్దిదారులు,కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేసారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్దిదారుల ఎంపిక,బ్యాంకులకు డీడీల చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్లు నారాయణ ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాల్లో టిడ్కో ఇళ్ల పై జరిగిన స్వల్ప కాలిక చర్చలో మంత్రి నారాయణ ప్రసంగించారు..18 మంది ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో టిడ్కో ఇళ్లలో జరిగిన అక్రమాలు,అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలను సభ దృష్టికి తీసుకొచ్చారు...ఆ తర్వాత సభలో మాట్లాడిన మంత్రి నారాయణ...అసలు టిడ్కో ఇళ్ల అనుమతుల నుంచి ఏం జరిగిందనేది వివరించారు. ఒక పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు నిరుపేదల కష్టాలు బాగా తెలుసన్నారు మంత్రి..అందుకే పేదలకు గేటెడ్ కమ్యూనిటీ తరహాలో ఇళ్లు నిర్మాణం కోసం శ్రీకారం చుట్టాం.సీఎం చంద్రబాబు ఆదేశాలతో వివిధ దేశాల్లో పేదల ఇళ్ల నిర్మాణాలు ఎలా జరిగాయో అధ్యయనం చేసాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేంద్రం నుంచి 7 లక్షల 1481 ఇళ్లకు అనుమతి తీసుకొచ్చాం..కేంద్ర ప్రభుత్వం లక్షా 50 వేలు,రాష్ట్ర ప్రభుత్వం మరో లక్షా 50 వేలు చెల్లించడంతో పాటు మౌళిక వసతుల కల్పనకు ఒక్కొక్క ఇంటికి 90 వేలు ఖర్చు భరించేలా ప్రణాళికలు రూపొందించాం...2014 – 2019 మధ్యలో హై క్వాలిటీ ఇళ్లను టిడ్కో ద్వారా చేపట్టాం.కేంద్రం అనుమతి ఇచ్చిన వాటిలో ముందుగా 5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టేలా నాటి టీడీపీ ప్రభుత్వంలో పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసాం.ముందుగా 4,54,706 ఇళ్లకు టెండర్లు పిలిచి నిర్మాణాలు ప్రారంభించాం. 2019 మే నెల నాటికి 77 వేల 370 ఇళ్లు వంద శాతం పూర్తి చేసాం.గత వైసీపీ ప్రభుత్వం ఎలాంటి కారణాలు లేకుండా మొత్తం ఇళ్లను 2 లక్షల 62 వేల 216 కు తగ్గించేసింది...దేశంలో ఏ రాష్ట్రంలో కూడా షీర్ వాల్ టెక్నాలజీతో ఇళ్లు నిర్మించలేదని....కేంద్రం సూచనలతో ఏడు రాష్ట్రఆల అధికారులు ఏపీకి వచ్చి ఇక్కడ నిర్మాణాలను పరిశీలించినట్లు మంత్రి సభకు తెలిపారు.వీటిలో మొత్తం 38,265 కోట్లతో చేపట్టిన ప్రాజెక్ట్ లో 7500 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేలా...ఏపీ ప్రభుత్వం 17,730 కోట్లు నిధులు ఇచ్చేలా డిజైన్ చేసామన్నారు మంత్రి..అయితే టిడ్కో ఇళ్లకు సంబంధించి 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించేలా కేంద్రం డిజైన్ చేసింది..అయితే కొంతమంది లబ్దిదారులు 360 .అడుగులు,మరికొంతమంది 430 చదరపు అడుగులు విస్తీర్ణంలో ఇళ్లు కావాలని కోరినట్లు మంత్రి నారాయణ తెలిపారు..మౌళిక వసతుల కోసం భరించే ఖర్చు 90 వేలు కాకుండా 300 చ.అ.విస్తీర్ణానికి 5.65 లక్షలు,360 చ.అడుగుల విస్తీర్ణానికి 6.65 లక్షలు,430 చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మించే ఇళ్లకు 7.65 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేసామన్నారు మంత్రి నారాయణ.అయితే గత ప్రభుత్వం లబ్దిదారులు చెల్లించాల్సిన వాటాలో గందరగోళం చేసి అస్తవ్యస్థంగా మార్చేసిందన్నారు. ప్రతి ఇంటి కిచెన్ లో బ్లాక్ గ్రానైట్ స్టోన్,స్టెయిన్ లెస్ స్టీల్ సింక్,అటకలు ఏర్పాటుచేసాం,కప్ బోర్డు లు ఏర్పాటు,ఏ గ్రేడ్ వర్టిఫైల్ టైల్స్ వేసినట్లు మంత్రి చెప్పారు..గేటెడ్ తరహాలో కమ్యూనిటీ హాల్సా ,పింగ్ కాంప్లెక్స్ ,స్కూల్ కూడా డిజైన్ చేసాం,అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్,అప్రోచ్ రోడ్డు,ప్రతి దగ్గర పార్కు,తాగునీరు,సదుపాయాలు కల్పించేలా డిజైన్ చేసాం..కానీ గత ముఖ్యమంత్రి అన్నింటిని పూర్తిగా వదిలేసారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో లబ్ధదిదారులు చాలా ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమన్నారు మంత్రి.నిర్మాణం పూర్తి కాని ఇళ్ల లబ్దిదారులను బ్యాంకులు లోన్ లు చెల్లించాలని అడుగుతున్నారని...వారంతా కట్టలేని పరిస్థితిలో ఉన్నారన్నారు..ఈ విషయంపై బ్యాంకులతో మాట్లాడుతున్నట్లు మంత్రి చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉందని...పార్టీ కలర్స్ టిడ్కో ఇళ్లకు వేయాలని కొంతమంది సూచించినప్పటికీ సీఎం చంద్రబాబు ఒప్పుకోలేదన్నారు...గేటెడ్ కమ్యూనిటీలో ఉన్నట్లు కలర్ లు వేసామన్నారు..అయితే గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటి రంగులు మార్చేసారన్నారు..కాంట్రాక్టర్లకు 540 కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయన్నారు.కాంట్రాక్టర్ల సమస్యలపై చీఫ్ ఇంజినీర్లతో కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటాం.ప్రస్తుతం టిడ్కో ఇళ్ల కు మౌళిక వసతుల కల్పన కోసం 5200 కోట్లు అవసరం అవుతుందన్నారు. .హడ్కో లేదా ఇతర బ్యాంకుల నుంచి రుణం కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు..వీలైనంత త్వరగా టిడ్కో ఇళ్లలో మౌళిక వసతుల కల్పన పూర్తి చేస్తామన్నారు..కొన్ని చోట్ల టీడీపీ ప్రభుత్వంలో ఇళ్లు పొందిన లబ్దిదారులను తొలగించడంతో పాటు కొంతమంది లబ్దిదారులు డీడీలు చెల్లించినప్పటికీ వాటిని బ్యాంకులలో జమ చేయలేదన్నారు...ఈ రెండు అంశాలపై దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్లు మంత్రి నారాయణ సభలో ప్రకటించారు..

# ప్రతి వ్యక్తికి మరింత మెరుగైన సేవలు

ఏపీస్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని తీసుకొస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. దేశంలోనే ఇది తొలిసారిగా అమలు చేస్తున్నాం అన్నారు. తద్వారా ప్రజా సేవలను చివరి వ్యక్తి వరకు అందించాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఢిల్లీలో ఓ మీడియా సంస్థ నిర్వహించిన లీడర్ షిప్ సమ్మిట్‌లో శనివారం చంద్రబాబు పాల్గొన్నారు ఈ సందర్భంగా పలు విషయాలను షేర్ చేసుకున్నారు. లీడర్‌షిప్ సదస్సులో ప్రసంగిస్తూ.. ఈ యుగంలో సమాచారమే ఓ పెద్ద నిధి అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు..** టెలికామ్ రంగంలో డీరెగ్యులేషన్ వల్ల పురోగతి ఉంటుందని రిపోర్ట్ ఇచ్చామని, దాన్ని అమలు చేయడంతో టెలికాం రంగం వృద్ధి చెందిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ టెక్నాలజీని ఉపయోగించి అన్ని రంగాల్లో పరిష్కారాలు వెతకొచ్చని తెలిపారు. ఒక స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచంలో ఏ మూలన ఉన్నా మన పనులు చేసుకుంటూ పోవచ్చని చంద్రబాబు వెల్లడించారు. సోషల్ మీడియాలో వేధించే సైకోలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై జాతీయ స్థాయిలోనే చట్టం తీసుకురావల్సిన అంశాన్ని ప్రస్తావించారు.

**జననాల రేటు పెరగాల్సిందే..** దక్షిణాది జనాభా అంశంపై చంద్రబాబు మాట్లాడుతూ.. గతంలో తాను బ్రేక్ సైలెన్స్ టాక్ ఎబౌంట్ ఎయిడ్స్ అనే నినాదాన్ని ఇచ్చానని గుర్తు చేస్తూ.. ఇప్పుడు బ్రేక్ సైలెన్స్ టాక్ ఎబౌట్ పాపులేషన్ మేనేజ్మెంట్ అని పిలుపునిస్తున్నాని అన్నారు. ఇప్పుడు చైనా, జపాన్ సహా అనేక ప్రపంచ దేశాల్లో వయోధికులు ఎక్కువైపోయారన్నారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సమస్య ప్రారంభమైందని వివరించారు. ఫెర్టిలిటీ రేటు ఇక్కడ తగ్గిపోతోందని.. సాధారణంగా ఇది 2.1 కంటే ఎక్కువగా ఉంటే సమస్య ఉండదన్నారు. ప్రస్తుతం బోర్డర్ లైన్‌లో జననాల రేటు ఉందన్నారు. ఇది కాస్త తగ్గితే జపాన్, చైనా మాదిరి సమస్య మొదలవుతుందన్నారు.

**కొత్త రూల్ తేవాలి.. ఇద్దరు పిల్లలుంటేనే..** దేశంలో 145 కోట్ల జనాభా ఉందని చంద్రబాబు అన్నారు. పాపులేషన్ మేనేజ్మెంట్ చేస్తే ప్రపంచంలో మనల్ని కొట్టేవారే ఉండరని ధీమావ్యక్తం చేశారు. మనం సరిగా ప్లాన్ చేస్తే 30–40 కోట్ల మంది భారతీయులు ప్రపంచంలో అన్ని మూలలకు వెళ్లి పనులు చేస్తారని, దేశానికి ఆదాయం తీసుకొస్తారని అన్నారు. బ్రిటీష్ వాళ్లు ఎలాగైతే భారత్‌కు వచ్చి పరిపాలించారో, మనం కూడా అలాగే ప్రపంచదేశాలకు వెళ్లి ఆ దేశాలను ఏలవచ్చని తన మనసులోని మాటను చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ నిబంధన తొలగించానన్నారు. కనీసం ఇద్దరు పిల్లలుంటే తప్ప పోటీకి అర్హత లేదని ఇప్పుడు నిబంధన పెట్టాలి.. అంటూ నవ్వుతూ చెప్పారు.

# పత్రికా స్వేచ్ఛను కాపాడటం కూటమి ప్రభుత్వ ధర్మం

● జాతీయ పత్రికా దినోత్సవం శుభాకాంక్షలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి సమాజ పురోగతికి, సమాజ చైతన్యానికి పత్రికల ఆవశ్యకత ప్రధానమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పాత్రికేయ రంగం నిష్పక్షపాతంగా ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...సమాజంలో రుగ్మతలను రూపుమాపడానికి పాత్రికేయులు చేసే కార్యక్రమాలు మార్గదర్శకమని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడే బాధ్యత అందరిపై ఉందని, ముఖ్యంగా రాజకీయ నాయకులపై ఉందని తెలిపారు. పత్రికలు పదికాలాలపాటు నిలబడితే తద్వారా చైతన్యం తీసుకొచ్చేందుకు అవకాశముంటుందన్నారు. మారుమూలన ఉన్న పాత్రికేయ మిత్రులు కూడా ఎన్నో సాహసోపేత కార్యక్రమాల ద్వారా ప్రజా జీవితాలను రంజింప చేస్తున్నారన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడటం తమ విద్యుక్త ధర్మంగా భావిస్తున్నామన్నారు. పాత్రికేయ రంగం నిష్పక్షపాతంగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు అన్నట్లు సామాజిక చైతన్యం కోసం, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తపిస్తూ నిష్పక్షపాతంగా పని చేస్తున్న పాత్రికేయ మిత్రులందరికీ జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు.

# రిజర్వాయర్ల అభివృద్ధికి రూ.156.60 కోట్లు

జలవనరుల శాఖ మంత్రిని కోరిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః అన్నమయ్య జిల్లాలో రైతులు, ప్రజలకు లబ్ధి చేకూరేవిధంగా పీలేరు మండిపల్లె నాగిరెడ్డి శ్రీనివాసపురం రిజర్వాయర్, అడవిపల్లె రిజర్వాయర్‌లో హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ బ్యాలెన్స్ పనులను పూర్తి చేసేందుకు రూ.156.60 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం విజయవాడలోని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం ఈ ఆరు మండలాలలో ఉన్న చెరువుల మరమ్మత్తు పనులు, తాగునీటి సమస్య తదితర ఇరిగేషన్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రిని కోరడం జరిగిందన్నారు. మరియు హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పనులు పూర్తి చేసి అడవిపల్లె రిజర్వాయిర్ కి నీళ్లు ఇవ్వాలన్నారు..రాబోయే రోజులలో నీటి నిల్వలు పెంపొందిస్తూ జిల్లాలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు ఇవ్వాలని జల వనరుల శాఖ మంత్రిని కోరడం జరిగిందన్నారు.



# బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయి

● బీజేపీ నేతల మూసీ నిద్ర వల్ల ఒరిగేది ఏమీ లేదు ● ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం ● టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

తెలంగాణ బ్యూరో\ప్రతినిధిః బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అందుకే ఆపార్టీ నేతలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధి, తాము ఏడాదిలో చేసిన అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇవాళ(శనివారం) గాంధీభవన్‌లో మహేష్ కుమార్ గౌడ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మూసీ నిద్ర ప్రజల అటెన్షన్ డైవర్ట్ చేయడానికేనని విమర్శించారు. బీజేపీ నేతల మూసీ నిద్ర వల్ల ఒరిగేది ఏమీ ఉండదని అన్నారు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై విజయోత్సవాలు జరుపుతున్నామని చెప్పారు. మహిళలకు, అన్నివర్గాల ప్రజలకు ఏం చేశామో వరంగల్ విజయోత్సవ సభలో వెల్లడిస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా..మాజీ మంత్రి కేటీఆర్‌పై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు తీవ్ర విమర్శలు గుప్పించారు. లగచర్లపై బీఆర్ఎస్ చేసిన దుర్మార్గపు చర్యలు బయటపడ్డాయని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. కేటీఆర్ తండ్రి చాటు పిలగాడని విమర్శించారు. ఇవాళ(శనివారం) సీఎల్పీ మీడియా సెంటర్‌లో మందుల సామేలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రిని అడ్డుపెట్టుకుని కేటీఆర్ అరాచకం చేశారని ఆరోపించారు. తెలంగాణ రాకముందు మీ ఆస్తులు ఎన్ని అని ప్రశ్నించారు. రాబందుల రాజ్యం కేసీఆర్ కుటుంబానిదేనని విమర్శలు చేశారు. కేసీఆర్ కుటుంబంలో ఉన్న ఆరుగురు రాబందులేనని ఆక్షేపించారు. కలెక్టర్లను మాజీ సీఎం కేసీఆర్ బానిసలుగా చేశారని ధ్వజమెత్తారు. ఐఏఎస్‌లతో కాళ్లు మొక్కించుకోవడం, దాడి చేయడం బీఆర్ఎస్ నాయకుల పని అని మందుల సామేలు ఆరోపించారు "కాళ్లు మొక్కిన వారిని కేసీఆర్ ఎమ్మెల్సీలను చేశారు. నీ జేజమ్మ వచ్చినా మమ్మల్ని ఏం చేయలేరు. ప్రభుత్వానికి కొండంత ప్రజాబలం ఉంది. మమ్మల్ని గోరంత కూడా ఏం చేయలేరు. రేవంత్ ఎక్కడ దోచుకున్నాడో చెప్పండి. తెలంగాణ పేరు మీద బీఆర్ఎస్ నాయకులు లీడర్లు అయ్యారు. రేవంత్ రెడ్డిని ఎవరు దించుతారో రండి. హరీష్‌రావు మేడిగడ్డ దగ్గర చాప వేసుకొని పడుకున్నాడు. బీఆర్ఎస్ తెర చినిగిపోయింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మూసీ దగ్గర పడుకుంటే మంచిది. బీజేపీ నాయకులు మూసీ దగ్గర పడుకుంటా అంటే మేమేమైనా వద్దని అన్నామా.. అడ్డుకుంటున్నామా అని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు మనిషికో గ్లాస్ తీసుకెళ్లి మూసీ నీళ్లను తాగాలి" అని మందుల సామేలు ఎద్దేవా చేశారు

# విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా?

●బాసర ట్రిపుల్ ఐటీలో ఏబీవీపీ నాయకులపై దాడి, అరెస్టులు దుర్మార్గం ● అరెస్ట్ చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలి ● ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినికి న్యాయం చేయమంటే దాడి చేయిస్తారా..? ● కేంద్రమంత్రి బండి సంజయ్



తెలంగాణ బ్యూరో\ప్రతినిధి: ట్రిపుల్ ఐటీ ముట్టడికి వెళ్తున్న ఏబీవీపీ నాయకులు అరెస్ట్‌లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ స్పందిస్తూ.. ఏబీవీపీ నాయకులపై పోలీసుల, బాసర ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఆత్మహత్య చేసుకున్న బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి న్యాయం చేయమంటే విచక్షణారహితంగా దాడి చేయిస్తారా? అని, బాసర ట్రిపుల్ లో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది? విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా? అని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా.. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ఎందుకు పరిష్కరించడం లేదు? అని, విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ఆయన మండిపడ్డారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు బండి సంజయ్. ట్రిపుల్ ఐటీ విద్యార్థి స్వాతి ప్రియ ఆత్మహత్యకు కారణాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న స్వాతిప్రియ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని బండి సంజయ్ అన్నారు. అరెస్ట్ చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలని, ఇంకా జాప్యం చేయకుండా బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు బండి సంజయ్

# డైవర్ట్ పాలిటిక్సే

● మూసీ పై నిలదీస్తే..తెరపైకి గాంధీ విగ్రహం ● గాడ్సే శిష్యుడు రేవంత్..ప్రపంచంలో ఎత్తైన గాంధీ విగ్రహం పెడుతాడంట ● సీఎం రేవంత్ రెడ్డి పై మండిపడ్డ కేటీఆర్





తెలంగాణ బ్యూరో\ప్రతినిధిః గాడ్సే శిష్యుడు రేవంత్ రెడ్డి గాంధీ విగ్రహం పెడుతాడంట అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెడితే ఊరుకుందామా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. మనం గట్టిగా మూసీ గురించి అడిగితే కొత్త పల్లవి ఎత్తుకున్నారు రేవంత్ రెడ్డి. బాపు ఘాట్ వద్ద అతి పెద్ద మహాత్మా గాంధీ విగ్రహాన్ని పెడతామని చెబుతున్నారు. గాంధీ గారికి విగ్రహాలు ఇష్టం ఉండదని అవే డబ్బులతో పేదవాళ్లకు మంచి చేయాలని మహాత్మా గాంధీ గారి మనువడు చెప్పారు. గాడ్సే శిష్యుడు, గాడ్సే వారసుడు రేవంత్ రెడ్డి. గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెడితే ఊరుకుందామా? మహాత్మా గాంధీని విగ్రహాన్ని అడ్డుపెట్టుకొని శిఖండి రాజకీయాలు చేస్తామంటే మంచిది కాదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలకు పైసలు లేవంట. కానీ మూసీకి రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తాడంట. రూ. 1100 కోట్లతో అయిపోయే మూసీ పునరుజ్జీవం విషయంలో మూసీలో రూ. లక్షా 50 వేల కోట్లు పోసే కుట్ర చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కడితే ఎంత ప్రయోజనం అంటూ ప్రశ్నించారు కదా? మరి మూసీతో మురిసే రైతులెందరూ, మూసీతో కొత్తగా సాగులోకి వచ్చే ఆయకట్టు ఎంత? మూసీ మూటల్లో మీ వాటా ఎంత? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు. బీజేపీ కూడా మొత్తానికి ఈ విషయంలో స్పందించింది. సంతోషం. రూ. లక్షా 50 వేల కోట్లు ఎవడి అబ్బ సొత్తని ఖర్చు చేస్తారో అడగండి. అడగటంతో ఆపకుండా విచారణ కూడా చేపట్టాలని నేను కోరుతున్నా. కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎం అయిపోయిందని ప్రధాని మోడీయే అంటారు. మరి ఎందుకు విచారణ జరపకుండా మౌనంగా ఉన్నారు. మేము అమృత్ టెండర్ల గురించి ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు సమాధానం లేదు. మూసీ పేరుతో రూ. లక్షా 50 వేల కోట్లు లూటీ చేస్తుంటే బీజేపీ వాళ్లు ప్రశ్నించటం లేదు అని కేటీఆర్ తెలిపారు.

**అమావాస్యకు బాంబులు కొంటే కార్తీక పౌర్ణమికి కూడా పేలట్లేదు పొంగులేటికి కేటీఆర్ చురకలు** బాంబుల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమావాస్యకు బాంబులు కొంటే కార్తీక పౌర్ణమి నాటికి కూడా పేలుతలేవు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చురకలంటించారు. ఆయన తుస్సు బాంబుల శాఖ మంత్రి అని కేటీఆర్ విమర్శించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటి మీద ఈడీ దాడులు జరిగి 45 రోజులు అయ్యింది. ఈడీ కానీ బీజేపీ వాళ్లు కానీ ఇప్పటి వరకు ఒక్క ప్రకటన చేయటం లేదు. ప్రజలు ఆగం కావద్దు. ఎవరు ఎవరితో ఉన్నారో అర్థం చేసుకోవాలి. మాకు పదవులు, కొట్లాట, కేసులు కొత్తకాదు. ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటాం. రేవంత్ రెడ్డితో మాకు గట్టు పంచాయితీ ఏమీ లేదు. కొడంగల్‌లో గిరిజనుల భూమి గుంజుకోవటంపై ప్రశ్నిస్తే ఆయనకు కోపం వస్తోంది. మూసీ కుంభకోణం గురించి ప్రశ్నిస్తే కోపం వస్తోంది. అర్హత లేని బావమరిది కంపెనీకి అమృత్ టెండర్లు కట్టబెట్టటంపై కోపం వస్తోంది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద ఈడీ గురించి అడిగితే సీఎంకు కోపం వస్తోంది అని కేటీఆర్ తెలిపారు. ఏదో కేసులు పెట్టి జైల్లో పెడితే ప్రశ్నించటం మానేస్తామని వాళ్లు అనుకుంటున్నారు. నేను జైలుకు పోతే వందలాది మంది కేసీఆర్, కేటీఆర్‌లు పుట్టుకొస్తారు. ఇప్పడే పోరాటం మొదలైంది. మరో నాలుగేళ్లు ఈ కాంగ్రెస్‌తో పోరాటం చేయాల్సి ఉంది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ఎందుకు పార్టీ మారాడో ప్రజలు అడగాలి. అభివృద్ధి కోసం పోయిన అంటే కేసీఆర్ కన్నా రేవంత్ రెడ్డి ఏం అభివృద్ధి చేసిండో చెప్పామనాలి అని ప్రజలకు కేటీఆర్ సూచించారు. ఎమ్మెల్యేలను బీజేపీ వాళ్లు మేకలను కొన్నట్లు కొంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చెబుతున్నారు. ఖర్గేను తెలంగాణ రమ్మని చెబుతున్నా. ఇక్కడ మా మేకలు మీ మందలో తప్పిపోయాయి చూడాలని కోరుతున్నా. ప్రకాష్ గౌడ్, అరికెపూడి గాంధీలకు సిగ్గుందా? ఏ పార్టీలో ఉన్నారో చెప్పే దమ్ముందా? కేసీఆర్ ఆధ్వర్యంలో నిరంతరం ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటాం. రాజేంద్రనగర్‌లో ఉప ఎన్నిక రావటం ఖాయం. ఉప ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరటం ఖాయం. రాజేంద్రనగర్‌ను భవిష్యత్‌లో అద్భుతంగా ముందుకు తీసుకెళ్లే నాయకుడు కార్తీక్ రెడ్డి అని కేటీఆర్ పేర్కొన్నారు

# చిన్నాన్న మృతిపట్ల లోకేష్ అవేదన



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: నారా రామ్మూర్తి నాయుడు మృతిపట్ల మంత్రి నారా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నాన్న నారా రామ్మూర్తి నాయుడు మృతి తీవ్ర విషాదాన్ని నింపిందన్నారు. "చిన్నాన్నతో చిన్ననాటి నా అనుబంధం కళ్ల ముందు కదిలి వచ్చిన కన్నీటితో నివాళులు అర్పిస్తున్నాను. మౌనమునిలా మారిన చిన్నాన్న ఇన్నాళ్లూ మాకు కంటికి కనిపించే ధైర్యం. మరోవైపు హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ ఏఐజీ ఆస్పత్రికి చేరుకున్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా కాసేపటి క్రితమే ఢిల్లీ నుంచి బేగంపేట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా ఏఐజీ ఆస్పత్రికి చంద్రబాబు రానున్నారు. ఏఐజీ ఆస్పత్రిలో ఉన్న నారా రామ్మూర్తి నాయుడు భౌతికకాయానికి మాజీమంత్రి మోత్కుపల్లి, తీగల కృష్ణారెడ్డి, సినీ నటుడు సుమన్, జీవిత నివాళులర్పించారు. అలాగే రామ్మూర్తి మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. నేటి నుంచి చిరకాల జ్ఞాపకం. చిన్నాన్న ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నాను. అంతులేని దుఃఖంలో ఉన్న తమ్ముళ్లు, పిన్ని ధైర్యంగా ఉండాలని కోరుతున్నాను" అని మంత్రి లోకేష్ అన్నారు.



# పోలీసుల విచారణకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే

● నాకు ఓ కుటుంబ వివాదం పరిష్కారం కోసం అడిషనల్ ఎస్పీ తిరుపతన్నను కలిశా ● తిరుపతన్న మా సామాజిక వర్గానికి చెందిన వాడు కావడంతో కుటుంబ వివాదాన్ని ఇద్దరం పరిష్కరించాం ● ఎప్పుడు విచారణకు పిలిచినా సహకరిస్తా ● మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తెలంగాణ బ్యూరో\ప్రతినిధిఇః ఫోన్ ట్యాపింగ్ కేసులో కల్వకుర్తి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను పోలీసులు విచారించారు. ఈ కేసులో జూబ్లీహిల్స్ ఏసీపీ ఎదుట జైపాల్ యాదవ్ శనివారం ఉదయం విచారణకు హాజరయ్యారు. జైపాల్ యాదవ్ స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. దాదాపు రెండు గంటల పాటు విచారణ జరిగింది. విచారణ అనంతరం జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. తిరుపతన్నకు తాను ఇచ్చిన రెండు ఫోన్ నెంబర్లు ట్యాపింగ్ అయ్యాయని వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చారని తెలిపారు. రెండు కుటుంబాల మధ్య విభేదాలు ఉండడంతో ఇద్దరి నంబర్స్ ఇచ్చినట్లు చెప్పారు. ఆ రెండు కాంటాక్ట్‌లకు చెందిన వారు రాజకీయాలకు సంబంధం లేదన్నారు. "నాకు ఓ కుటుంబ వివాదం పరిష్కారం కోసం అడిషనల్ ఎస్పీ తిరుపతన్నను కలిశాను. తిరుపతన్న మా సామాజిక వర్గానికి చెందిన వాడు కావడంతో కుటుంబ వివాదాన్ని ఇద్దరం పరిష్కరించాము. నేను ఇచ్చిన రెండు ఫోన్ నంబర్లు తిరుపతన్న ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు పోలీసులు వివరణ కోరారు. వారు కొన్ని ఆధారాలు ముందు పెట్టి విచారణ చేశారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాను. ఎప్పుడు విచారణకు పిలిచినా నేను సహకరిస్తాను. ఈ ఇష్యూ పొలిటికల్‌కు సంబంధం లేదు" అని జైపాల్ యాదవ్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఇప్పటి వరకు కేవలం పోలీస్ ఆఫీసర్ల ప్రమేయానికి సంబంధించి విచారణ కొనసాగించారు. ఇప్పుడు పొలిటికల్ లీడర్ల ప్రమేయానికి సంబంధించి పోలీసులు ఆధారాలు సేకరించిన తర్వాత బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికీ నోటీసులు జారీ చేసి విచారణ చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే మాజీ ఎమ్మెల్యే లింగయ్యకు నోటీసులు జారీ చేసి.. దాదాపు రెండు గంటల పాటు విచారణ చేసి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను విచారణకు హాజరుకావాలని చెప్పడంతో ప్రస్తుతం ఆయన జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఐవోగా ఉన్న జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలోనే విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి కొన్ని కీలకమైన ఆధారాలు సేకరించారు. ఇప్పటి వరకు జ్యూడిషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులు భుజరంగరావు, రాధాకిషన్‌తో మాజీ ఎమ్మెల్యే టచ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు ఎన్నికల సమయంలో అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు తనకు సంబంధాలు ఉన్నాయన్న అభియోగాలు ఆరోపణలతో గతంలో లింగయ్యను విచారణ జరిపారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసులో జైపాల్ యాదవ్ పాత్ర ఏంటి అనేది క్లారిటీ రావాల్సి ఉంది. అయితే ఈ కేసులో మాజీ ఎమ్మెల్యేలను నిందితులుగా చేర్చబోతున్నారా.. సాక్షులుగా పెట్టబోతున్నారా అనేది సస్పెన్స్‌గా మారింది. ఇప్పటి వరకు ఎస్ఐబీ పనిచేసిన అధికారులను, టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన డీసీపీ రాధాకిషన్ రావును విచారణ జరిపి.. వారికి సంబంధించిన ఆధారాలు సేకరించిన తర్వాత అందరినీ కూడా అరెస్ట్ చేసి జ్యూడిషిల్ రిమాండ్‌కు తరలించారు. ఇప్పుడు పొలిటికల్ లీడర్ల ప్రమేయానికి సంబంధించి విచారణ కొనసాగుతోంది. అప్పటి బీఆర్ఎస్‌లో కీలకంగా వ్యవహరించిన నేతలకు కూడా ఒకటి రెండు రోజుల్లో నోటీసులు జారీ చేసి విచారణ జరపాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలోనే ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోంది. ఈ కేసులో అరెస్ట్ అయిన అధికారులతో మాజీ ఎమ్మెల్యేలకు సంబంధాలు ఉన్నాయని, ఎన్నికల సమయంలో కొందరు వ్యక్తుల నెంబర్‌ను అధికారులకు పంపించి వాళ్ల ఫోన్ ట్యాప్ చేయించారనే అభియోగాలు, ఆరోపణలతోనే మాజీ ఎమ్మెల్యేలను పోలీసులు విచారిస్తున్నారు

# టీజీ టెట్ అభ్యర్థులకు అలర్ట్

తెలంగాణ బ్యూరో\ప్రతినిధిః ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టెట్ అభ్యర్థులను స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అలర్ట్ చేసింది. దరఖాస్తుదారులు తమ అప్లికేషన్‌ను ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.వెబ్‌సైట్ ద్వారా ఎడిట్ చేసుకోవచ్చు. తదితర వివరాల కోసం 7032901383, 9000756178 నంబర్లను సంప్రదించొచ్చు. ఇక దరఖాస్తులకు చివరి తేదీ నవంబర్ 20. ఈ ఏడాది మేలో నిర్వహించిన టెట్‌కు హాజరై, అర్హత సాధించని వారికి ఉచితంగా దరఖాస్తు చేసుకునేందు వెసులుబాటును కల్పించింది. డిసెంబర్ 26 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముండగా, 2025 జనవరి 1 నుంచి 20 వరకు టెట్ పరీక్ష లను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఫిబ్రవరి 5న టెట్ ఫలితాలను విడుదల చేస్తారు

# సినిమాటికా ఎక్స్‌పో 2వ ఎడిషన్



ప్రపంచ ప్రఖ్యాత యానిమేషన్, వివిఎఫ్ఎక్స్, గేమింగ్ రంగాలకు సంబంధించిన టెక్నాలజీ, టెక్నీషియన్స్‌ను ఒకటే చోటికి చేర్చి సందర్శకులకు పరిచయం చేసే ఇండియాజాయ్ మరియు సినిమాటికా ఎక్స్ పో మరోసారి అలరించడానికి సిద్దమైంది. గతేడాది ఆవిష్కరించిన అంతర్జాతీయ ప్రదర్శనకు తెలుగు చలనచిత్ర పరిశ్రమ సహా పలువురు ప్రముఖుల నుంచి అనూహ్య స్పందన లభించడంతో ఈ ఏడాది సినిమాటికా ఎక్స్‌పో 2వ ఎడిషన్‌ను నవంబర్ 16, 17 తేదీలలో హెచ్.ఐ.సి.సి నోవోటెల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. తెలంగాణ ఐటి శాఖ సహకారంతో.. సినిమా, టెక్నాలజీ, సృజనాత్మకత వంటి అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రపంచ ప్రఖ్యాత విజువల్ ఎఫెక్ట్స్ టెక్నీషయన్లను, ఫిలింమేకర్లను, సోనీ-యారీ-రెడ్ తదితర టెక్నాలజీ కంపెనీలకు చెందిన ప్రతినిధులను ఒకే చోట కలుసుకోవడానికి ఈ ఎక్స్‌పో వేదిక కానుంది. 2023లో జరిగిన సినిమాటికా ఎక్స్‌పోలో టాలీవుడ్ అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున, 'కల్కి' డైరెక్టర్ నాగ్ అశ్విన్, 'బాహుబలి-ఆర్ఆర్ఆర్' సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్, తెలుగు సినిమాటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీజీ విందాతో సహా పలువురు సినీ ప్రముఖులు, టెక్నీషియన్స్ హాజరై తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ ఈవెంట్‌లో అత్యాధునిక సినిమా పరికరాలు, సాఫ్ట్‌వేర్‌లను ప్రదర్శనకు ఉంచడంతోపాటు, సెమినార్‌లు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, కొత్త ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్ అలరించనున్నాయి.

# 'కుబేర' ఫస్ట్ గ్లింప్స్



నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల మచ్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'కుబేర'లో ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న కంప్లీట్ డిఫరెంట్ పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లు, క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోలు ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు హైలీ యాంటిసిపేటెడ్ కుబేర ఫస్ట్ గ్లింప్స్ ని లాంచ్ చేశారు. ఫస్ట్ గ్లింప్స్ ని ప్రతి లీడ్ రోల్ పై క్యురియాసిటీ క్రియేట్ చేసేలా ప్రజెంట్ చేశారు. ధనుష్ స్లమ్స్ లో హంబుల్ లైఫ్‌ని గడుపుతున్న వ్యక్తిగా పరిచయం అయ్యారు. ఎలాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ అతని ముఖంలో ఆనందం కనిపిస్తోంది. మరోవైపు, నాగార్జున తన కుటుంబంతో ముంబైలో నివసిస్తున్న సక్సెస్ ఫుల్ మ్యాన్ గా కనిపించారు. జిమ్ సర్భ్ బిలియనీర్ బిజినెస్ మ్యాన్‌గా కనిపిస్తాడు, రష్మిక మందన్న పాత్ర ఆమె మధ్యతరగతి జీవితంలో అసంతృప్తితో పోరాడుతున్నట్లు కనిపిస్తుంది, మరింత ప్రోగ్రస్ కోసం ఆరాటపడుతుంది. ప్రతి పాత్రని వారి ఎమోషనల్ కాన్ఫ్లిక్ట్ తో పోరాడుతున్నట్లు ప్రజెంట్ చేశారు, గ్లింప్స్ పవర్ ఫుల్ మూమెంట్స్ ని అందిస్తోంది, ధనుష్ సంప్రదాయ తెల్లని లుంగీ, చొక్కా ధరించి కనిపించారు. అతని ముఖంలో అసంతృప్తి నోటీస్ చేయొచ్చు.శేఖర్ కమ్ముల క్లవర్ కట్ మనకు సమాధానాల కంటే ఎక్కువ ప్రశ్నలను రేకెత్తిస్తుంది. కథను ఎక్కువగా రివిల్ చేయకుండా పాత్ర పరిచయాలు, వారి ఎమోషనల్ ఆర్క్‌లపై దృష్టి సారిస్తుంది. ధనుష్, నాగార్జున, జిమ్ సర్భ్, రష్మిక మందన్న తమదైన ఎనర్జీని తెరపైకి తెస్తున్నారు.

# రోటి కపడా రొమాన్స్

## విజయం సాధించాలి



హుషారు, సినిమా చూపిస్త మావ, మేం వయసుకు వచ్చాం, ప్రేమ ఇష్క్ కాదల్, పాగల్' వంటి యూత్ ఫుల్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత, లక్కీ మీడియా అధినేత బెక్కెం వేణుగోపాల్.. సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. నవంబరు 22న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమాన్ చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన తేజా సజ్జా విచ్చేశారు. ఈ సందర్భంగా తేజా సజ్జా మాట్లాడుతూ " ఈ వేదిక మీద వున్న నూతన టాలెంట్‌కు ఈ సినిమా ఎన్నో ఏళ్ల కల. ఈ చిత్రంతో నిర్మాత బెక్కెం వేణుగోపాల్ ఎంతో మంది నూతన నటీనటు లను పరిచయం చేస్తున్నాడు. ఆయన్ని చూస్తే ఎంతో ఇన్స్పయిరింగ్‌గా వుంటుంది. ఆయన ఇప్పటి వరకు తీసిన 14 సినిమాల్లో ఎంతో మంది దర్శకులను, రచయితలను, నటీనటులను సినీ పరిశ్ర మకు పరిచయం చేశాడు. నేను కూడా కెరీర్ ప్రారంభంలో గోపీ ఆఫీసుకు వెళ్లేవాడిని. కానీ ఆయనతో సినిమా కుదరలేదు అన్నారు.

# 'దేవకి నందన వాసుదేవ'

## యాక్షన్, కమర్షియల్ ఎంటర్‌టైనర్



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా తన సెకండ్ మూవీ 'దేవకి నందన వాసుదేవ'తో అలరించడానికి సిద్ధంగా వున్నారు. ఈ చిత్రానికి గుణ 369తో హిట్ కొట్టిన అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంత్ వర్మ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్ప ణలో లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఇప్పటికే టీజర్, ట్రైలర్, సాంగ్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. నవంబర్ 22 ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అర్జున్ జంధ్యాల విలేక రుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

'గుణ 369' తర్వాత మీ రెండో సినిమాకి ఇంత గ్యాప్ రావడానికి కారణం?

గ్యాప్ ఏమీ లేదండి. కరోనా కారణంగా సహజంగానే అందరికీ ఓ రెండేళ్ళు గ్యాప్ వచ్చింది. తర్వాత ఈ ప్రాజెక్ట్ తో దాదాపు ఏడాదిన్నరగా ట్రావెల్ అవుతున్నాను. ఇలా చూసుకుంటే గ్యాప్ లేనట్లే.

'దేవకి నందన వాసుదేవ' ట్రైలర్ లో కంసుడు, కృష్ణుడు రిఫరెన్స్ కనిపించింది ? ఆ కథ స్ఫూర్తి ఉందా ?

ఆ రిఫరెన్స్ ఇందులో ఉంటుంది. మూడో సంతానం వలన మరణం అని ట్రైలర్ లోనే చాలా క్లియర్ గా చెప్పాము. అయితే చెప్పని విశేషాలు చాలా ఉన్నాయి. ట్రైలర్లో కంటే చాలా ఎక్కువ కథ సినిమాలో ఉంది.

ఈమధ్య డివోషనల్ కంటెంట్ ఉన్న సినిమాలు విజయం సాధిస్తున్నాయి కదా.. ఆ తరహాలో ఈ కథ చేశారా?

అలా ఏం లేదండి. హనుమాన్ సినిమా రాకముందే ఈ కథని లాక్ చేసుకున్నాం. నేను, నిర్మాత కలిసి ఒక సినిమా చేయాలనుకున్నాము. అలాగే నిర్మాతకి ప్రశాంత్‌కి ఒక కమిట్మెంట్ ఉంది. అశోక్ గల్లాకి అంతకుముందు ఒక కథ చెప్పాను. అ వర్క్ జరుగుతున్నా సమయంలో ప్రశాంత్ ఈ కథ చెప్పారు. ఇది అశోక్ కి నచ్చింది. మా అందరి మధ్య చాలా మంచి బాండింగ్ ఉంది. ప్రశాంత్ కి నేను తీసిన గుణ సినిమా ఇష్టం. ఈ కథకు నేనైతే ఓకే అని ఆయన భావించారు. అలా ఈ ప్రాజెక్టుని చేయడం జరిగింది.

ప్రశాంత్ చెప్పిన కథకి మీరు ఎలాంటి మార్పులు చేసుకున్నారు?

దర్శకుడిగా కథని ఓన్ చేసుకోవాలి. అలా చేసుకున్నప్పుడు కొన్ని ఐడియాస్ వస్తాయి. కథని ఇంకా అద్భుతంగా చెప్పాలనిపిస్తుంది. నేను చెప్పిన కొన్ని ఆలోచనలకి ప్రశాంత్ హ్యాపీగా ఫీలయ్యారు.

# రామభక్త హనుమా క్రియేషన్స్ లో 'వారణాసి'



సనాతన ధర్మం గొప్పదనాన్ని తెలియజేస్తూ రామభక్త హనుమా క్రియేషన్స్ బ్యానర్‌లో ఓ కొత్త చిత్రం రూపొందుతోంది. 'రఫ్' చిత్ర దర్శకుడు సుబ్బారెడ్డి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి 'వారణాసి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. సనాతన ధర్మం ఎంత గొప్పదో తెలియజేస్తూ పక్కా మాస్ కమర్షియల్ ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఒక స్టార్ హీరో నటిస్తుండగా, మరో స్టార్ డైరెక్టర్ స్క్రీన్‌ప్లే, మాటలు అందిస్తున్నారు. భారతదేశంలో అతి పవిత్ర ప్రదేశమైన వారణాసి పుణ్యక్షేత్రంలోనే షూటింగ్ మొత్తం జరుగుతందని దర్శకుడు సుబ్బారెడ్డి తెలియజేశారు.




# 'మహా సంద్రం' పూజా కార్యక్రమాలు

ప్రస్తుతం కొత్త కంటెంట్ చిత్రాలు వస్తున్నాయి. కొత్త తరం ఇండస్ట్రీలోకి వస్తూ డిఫరెంట్ సబ్జెక్టులతో ఆడియెన్స్‌ను మెస్మరైజ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే 'మహా సంద్రం' అనే యాక్షన్ డ్రామాతో కొత్త టీం రాబోతోంది. నవీనీత్ రైనా హీరోగా రాబోతోన్న ఈ చిత్రానికి శేషు రావెళ్ళ, కార్తికేయ. వి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వీవీఎం క్రియేషన్స్, కేవీఎం ఆర్ట్స్ ఎల్ఎల్‌పి బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వం బాధ్యతల్ని కార్తికేయ. వి నిర్వర్తించనున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు దామోదర ప్రసాద్, ఎన్. శంకర్, సముద్ర, ఆర్. అనిల్ వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పూజా కార్యక్రమాల అనంతం దామోదర ప్రసాద్ క్లాప్ కొట్టగా.. ఎన్. శంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి సముద్ర గౌరవదర్శకత్వం వహించారు. పద్మనాభరెడ్డి, రామసత్యనారాయణ స్క్రిప్ట్ అందజేశారు. ఈ చిత్రానికి ప్రేమ్ రాజ్ ఎనుముల డైలాగ్స్ అందించనున్నారు కళ్యాణ్ సామి కెమెరామెన్‌గా, జగదీష్ ఎడిటర్‌గా పని చేయనున్నారు.




# తెలుగులో "భైరతి రణగల్"



కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ మరో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఆయన హీరోగా నటించిన "భైరతి రణగల్" సినిమా థియేటర్స్ లోకి వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు భారీ ఓపెనింగ్స్ వస్తున్నాయి. సూపర్ హిట్ మూవీ "మఫ్తీ"కి ప్రీక్వెల్‌గా టాలెంటెడ్ డైరెక్టర్ నర్తన్ ఈ చిత్రాన్ని రూపొందించారు. గీతా పిక్చర్స్ బ్యానర్ పై గీతా శివరాజ్ కుమార్ భైరతి రణగల్ చిత్రాన్ని నిర్మించారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ రిలీజ్‌తో తెలుగు ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సంతోషంలో శివరాజ్ కుమార్ అభిమానులు సినిమాలోని ఆయన మేకోవర్ తో థియేటర్స్ వద్ద సందడి చేస్తున్నారు. "భైరతి రణగల్" చిత్రంలో ఇతర కీలక పాత్రల్లో రాహుల్ బోస్, నానా పటేకర్, రుక్మిణి వసంత్, అవినాష్, యోగి బాబు, దేవరాజ్ నటించారు. తెలుగులోనూ పలు క్రేజీ ప్రాజెక్ట్స్‌లో నటిస్తున్న శివరాజ్ కుమార్..."భైరతి రణగల్" మూవీతో ఇక్కడా మంచి విజయాన్ని అందుకోబోతున్నారు.

# జనవరి 3 "ప్రేమచరిత్ర - కృష్ణ విజయం"

తెలుగు చలనచిత్ర చరిత్రలో చెరగని ముద్ర వేసి, సౌజన్యానికి, సాహసానికి నిలువెత్తు నిర్వచనంగా నిలిచిన సూపర్ స్టార్ కృష్ణ నటించిన చివరి చిత్రం "ప్రేమ చరిత్ర - కృష్ణ విజయం". అంబుజా మూవీస్ - రామ్ ఫిల్మ్స్ బ్యానర్స్ పై హెచ్.మధుసూదన్ దర్శకనిర్మాతగా రూపొందిన ఈ చిత్రంలో యశ్వంత్ - సుహాసిని జంటగా నటించగా... నాగబాబు, ఆలీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. నవంబర్ 16, సూపర్ స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించి, విడుదల తేది ప్రకటించేందుకు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్.దామోదర్ ప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్, ప్రముఖ దర్శకనిర్మాత సునీల్ కుమార్ రెడ్డి, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, "హతవిధి" చిత్రంతో హీరోయిన్ కమ్ ప్రొడ్యూసర్‌గా పరిచయమవుతున్న డైనమిక్ లేడి లల్లీ మధు మిత, కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాదర్ గోరి, పద్మాలయ శర్మ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ, దర్శకనిర్మాత హెచ్.మధుసూదన్, సహ నిర్మాత బండ్రి నాగరాజ్ గుప్తా పాల్గొన్నారు. సూపర్ స్టార్ కు ఘన నివాళి అర్పించిన అనంతరం... సినిమాను జనవరి-3న సంక్రాంతి కానుకగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.



# "డ్రింకర్ సాయి" టీజర్ లాంచ్

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "డ్రింకర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "డ్రింకర్ సాయి" సినిమా టీజర్ ను సామాన్యులే సెలబ్రిటీలుగా ఆటో డ్రైవర్, ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, మోటార్ మెకానిక్, వెయిటర్, కూలీ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ - "డ్రింకర్ సాయి" సినిమా టీజర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాం. ప్రేక్షకుల మనసుల్ని కదిలించే చిత్రమిది. చిన్న సినిమా ఓటీటీలో, పెద్ద సినిమా థియేటర్స్ లో చూడాలని అనుకుంటారు కానీ మా "డ్రింకర్ సాయి" సినిమా థియేటర్స్ లో బెస్ట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. త్వరలోనే "డ్రింకర్ సాయి" సినిమాను మీ ముందుకు తీసుకొస్తాం. అన్నారు.




PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.